చిన్నారులు.. అపర దుర్గమ్మలు



పాఠశాలలకు దసరా సెలవులు ఇస్తుండటంతో ముందస్తు వేడుకలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. అమ్మవారి పూజలు, నృత్యాలతో సందడి నెలకొంటుంది. కత్తిపూడిలోని ఓ విద్యాలయం ఆవరణలో రావణాసుర దహనం, చిన్నారుల వేషధారణ ఆకట్టుకున్నాయి.

-న్యూస్‌టుడే, శంఖవరం

అన్నవరంలో రేపట్నుంచి దసరా ఉత్సవాలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో గురువారం నుంచి దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. 3వ తేదీ నుంచి 12 వరకు 9 రోజులు ఇవి జరగనున్నాయి. ప్రతి రోజూ ప్రధానాలయం, క్షేత్ర రక్షకులు వనదుర్గ, కనక దుర్గ ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. లక్ష కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలూ ఉంటాయి. 11న దుర్గాష్టమి సందర్భంగా చండీహోమం.. 12న విజయదశమి రోజు ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహిస్తారు. రాత్రికి కొండ దిగువన గజ వాహనసేవ, శమీపూజ అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో రావణ సంహారం ఉంటాయని అధికారులు తెలిపారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆయా విభాగాల అధికారులకు ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశాలిచ్చారు.

◆ అవతారాల్లో దర్శనం..

3న బాలత్రిపుర సుందరి, 4న లక్ష్మీదేవి, 5న అన్నపూర్ణ, 6న శారదాదేవి, 7న కల్యాణగౌరి, 8న గాయత్రీదేవి, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని, 12న రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో క్షేత్ర రక్షకులు దర్శనమివ్వనున్నారు.

బాపూ మాట.. స్ఫూర్తి బాట

గాంధీ జయంతి నేడు

ఆ మహనీయుని ప్రతి మాట నేటి తరానికి స్ఫూర్తిమంత్రం.. ప్రతి సిద్ధాంతం ఆచరణాత్మకం..'అహింస' అనే ఆయుధంతో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన జాతిపిత గాంధీజీ.. ప్రపంచవ్యాప్తంగా పరిమళించిన ఆయన కీర్తి ఎందరికో స్ఫూర్తి.. ఆయన లాంటి వ్యక్తి రక్తమాంసాలతో ఈ భూమిపై తిరిగారంటే తర్వాతి తరాలు నమ్మకపోవచ్చ'ని ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అన్నారంటే బాపూ వేసిన ముద్ర ఏ స్థాయిదో అర్థం చేసుకోవచ్చు.. గాంధీ చూపిన బాట నాటికీ.. నేటికీ.. ఎన్నటికీ మార్గదర్శకమే. ఆయన జయంతి వేళ.. తూర్పుతో అనుబంధం.. ఆ అడుగుజాడల్లో నడుస్తున్న ప్రాంతాల గురించి అవలోకిస్తే..

'దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు.. గ్రామాలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది'..

● స్వచ్ఛత, శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువత అందులో భాగస్వాములు కావాలి.

● దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉంది.

● మనిషి ప్రకృతిలో మమేకం కావాలి.. అందులో అన్ని ప్రాణులకు భాగస్వామ్యం ఉందనే విషయం మరువకూడదు. మన అవసరాల కోసం ప్రకృతిని ధ్వంసం చేయకూడదు. అది భావితరాలకు శ్రేయస్కరం కాదు.'

● 'హింసను అహింసతో ఎదుర్కోవాలి. చెడును నిర్మూలించడానికి ఆయుధాలు పడితే జరిగేది రెండు దుష్టశక్తుల మధ్య యుద్ధం మాత్రమే..'

● 'ఈ ప్రపంచంలో నువ్వు చూడాలనుకుంటున్న మార్పు.. మొదట నీతోనే మొదలవ్వాలి.'

ఈనాడు, కాకినాడ



గాంధీ 150వ జయంతి సందర్భంగా రూ.150 స్మారక నాణెం

నాణేలు స్మృతులు..

స్వాతంత్ర్య పోరాటంలో అందర్నీ ఏకతాటిపైకి తెచ్చిన మహాత్ముడు బాపూజీ. ఆయన సాధించిన పలు విజయాలకు గుర్తుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్మారక నాణేలను విడుదల చేసింది. కాకినాడకు చెందిన జానకీరామ్ చౌదరికి నాణేల సేకరణ అంటే ఆసక్తి. బోసినవ్వుల బాపూ రూపులున్న అరుదైన నాణేలు, నోట్లు సేకరించి ప్రదర్శనకు ఉంచారు.

- న్యూస్‌టుడే, గాంధీనగర్



ఉప్పు సత్యాగ్రహం 75 ఏళ్లు పూర్తయిన సందర్భం..



వి.కొత్తూరు గ్రామం

ఈ పల్లెలు మద్యానికి దూరం

కిర్లంపూడి, తుని గ్రామీణం: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో ఉన్న గ్రామం ముక్కొల్లు. 3900 మంది జనాభా అక్కడ ఉన్నారు. గత దశాబ్ద కాలంగా ఇక్కడ మద్యం ఊసే లేదంటే అతిశయోక్తి కాదు. అంతకుపూర్వం సారా తయారీ, బెల్టు షాపులు, మందుబాబుల వీరంగం, అరెస్టులు వంటివి ఉండేవి. ఎలాగైనా ఇక్కడి పరిస్థితులను మార్చాలని మహిళలు పెట్టుకొన్న సంకల్పం ఓ మార్పునకు దారితీసింది. గ్రామ పెద్దలు, యువత తోడవడంతో మద్యం అమ్మేవారిని, సారా తయారీదారులను నియంత్రించారు. ఇందుకు రెండేళ్లు పట్టింది. 2011 నుంచి మద్యరహిత గ్రామంగా పేరొందింది. ఇప్పుడు గ్రామం ప్రశాంతంగా ఉంది. అక్షరాస్యత కూడా ఎక్కువే. గతంలో బడికి వెళ్లని చిన్నారులు అధికంగా ఉండేవారు. ఇప్పుడు ప్రతి ఒక్కరు స్థానిక పాఠశాలలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారు.

● గ్రామ పెద్దలు నిర్ణయించిన ప్రకారం తుని మండలం వి.కొత్తూరు కొన్ని దశాబ్దాలుగా మద్యం విక్రయాలు లేని గ్రామంగా గుర్తింపు పొందింది. ఎవరైనా మద్యం, సారా, మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే గ్రామ కమిటీ సభ్యులు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

మహాత్ముని అడుగుజాడలు

కిర్లంపూడి: ఉప్పు సత్యాగ్రహ యాత్రలో భాగంగా కిర్లంపూడి గాంధీ వచ్చారు. కొక్కొండ వెంకట రామశేషగిరిరావు పంతులు ఇంటిలో మహాత్ముడు భోజనం చేశారు. ఉద్యమం కోసం శేషగిరిరావు భార్య కృష్ణవేణమ్మ బంగారు కాసుల పేరు, వెండి నాణేలు, కొంత నగదు అందజేశారు.

ప్లాస్టిక్ భూతం వద్దే వద్దు

తాళ్లరేవు: ప్లాస్టిక్ వినియోగంతో కలిగే ముప్పును తాళ్లరేవు మండలం జి.వేమవరం గ్రామస్థులు గ్రహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం స్ఫూర్తితో ఇటీవల సర్పంచి పుణ్యమంతుల సూరిబాబు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే రూ.10 వేలు జరిమానా విధించాలంటూ ఏకగ్రీవంగా తీర్మానించారు. వాటికి బదులుగా విస్తరాకులు, అరటి ఆకులు వాడదామంటూ ప్రతినబూనారు.



వీధులను శుభ్రం చేస్తున్న యువకులు

హృద్రోగ విభాగాన్ని చక్కదిద్దుతాం

☛ ప్రభుత్వం దృష్టికి జీజీహెచ్ సమస్యలు
☛ కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



ఈనాడు కథనానికి స్పందన

ఈనాడు, కాకినాడ: కాకినాడ జీజీహెచ్‌లోని హృద్రోగ విభాగంలో సమస్యలు వైద్యారోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. సెప్టెంబర్ 2న 'లబ్‌డబ్.. లయ తప్పుతోంది'.. 29న 'గుప్పెడు గుండెలో పెను తుపాను' శీర్షికలతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలపై ఎంపీ స్పందించారు. జీజీహెచ్‌లో సమస్యలు తన దృష్టికి వచ్చాయని, చక్కదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని పరిష్కరించే దిశగా జీజీహెచ్ బృందంతో ప్రత్యేక సమీక్ష ఏర్పాటుచేయమని మంత్రిని కోరతానన్నారు.



చక్కదిద్దితే పేద రోగులకు మేలు..

జీజీహెచ్‌లోని హృద్రోగ వైద్య విభాగంలో ప్రస్తుతం ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారని.. మంజూరైన పోస్టుల ప్రకారం చూస్తే ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలని ఎంపీ అన్నారు. ఈ పోస్టులు భర్తీచేస్తే అయిదారు జిల్లాల నుంచి కాకినాడకు ఉచిత వైద్యం కోసం వచ్చే పేద రోగులకు మేలు జరుగుతుందన్నారు. క్యాథ్‌ల్యాబ్‌లో అనుసంధానంగా ఐసీయూ ఏర్పాటు అవసరాన్ని, యాంజియోప్లాస్టీ వేసే సామగ్రి కొరత విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు

గస్తీ ముమ్మరం

పండగ వేళ ప్రత్యేక పోలీస్ సిబ్బంది



మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ జిల్లాలో దసరా పండగ పురస్కరించుకుని రాత్రి గస్తీ ముమ్మరం చేసినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ప్రత్యేక సిబ్బంది, వాహనాలు కేటాయించామన్నారు. పోలీసుశాఖ ఉచితంగా అందిస్తున్న ఎల్‌హెచ్ఎంఎస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) సేవలను ఉపయోగించుకోవాలన్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు వారి వివరాలు, చిరునామాను సమీప పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. ఎల్‌హెచ్ఎంఎస్ సేవలు కావాల్సిన వారు పోలీసు కంట్రోల్ రూమ్ నం.9490763489 లేదా 112కు ఫోన్ చేయాల్సి ఉంది. ఈనెల 3 నుంచి దసరా సెలవుల నేపథ్యంలో నేరాల నియంత్రణ కోసం పెట్రోలింగ్ బీట్లు పెంచామన్నారు. కాకినాడ నగరంలో ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌కు ఎస్సైను నియమించినట్లు తెలిపారు.

పోలవరం దస్త్రాల దహనం కేసులో కదలిక

☛ దృష్టిసారించిన మంత్రి లోకేశ్
☛ పూర్తి వివరాలివ్వాలని అధికారులకు లేఖ

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం గ్రామీణం

ధవళేశ్వరంలోని పోలవరం పరిపాలనా కార్యాలయంలో సంచలనం కలిగించిన దస్త్రాల దహనం వ్యవహారంలో వాస్తవాలు నిగ్గుతేల్చే దిశగా అడుగులు పడుతున్నాయి. బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఇటీవల నిర్వాసితులు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన.. అధికారుల పాత్రతో పాటు, దహనమైన దస్త్రాల పూర్తి వివరాలను నిర్దేశిత సమయంలో అందించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించిన లేఖ మంత్రి పేషీ నుంచి ఇటీవల పోలవరం పరిపాలనా కార్యాలయానికి చేరింది. దీంతో అధికారులంతా ఉరుకులు పరుగులు తీస్తున్నారు

బెయిల్‌కు యత్నం

దస్త్రాల దహనంలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి.. అరెస్టు నుంచి తప్పించుకొనేందుకు ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఆ ప్రయత్నం బెడిసికొట్టినట్లు సమాచారం. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చట్టం ప్రకారం కేసు నమోదైంది. ఘటనకు రెండురోజుల ముందు తీసుకువచ్చిన కొత్త బీరువాలు ఇప్పుడు చర్చలో నిలిచాయి. వాటిని దళారుల నుంచి తీసుకువచ్చారా? లేదా కొనుగోలు చేశారా? అనేదానిపై విచారణ జరుగుతోంది.

నన్నయ పిలుస్తోంది

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు కౌన్సెలింగ్

నన్నయ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ (టూరిజం అండ్ హాస్పటాలిటీ), ఎంసీఏ కోర్సులలో భర్తీ చేయని సీట్లకు ఈనెల 5న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఏపీ ఐసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులే హాజరు కావాలని వీసీ వై.శ్రీనివాసరావు తెలిపారు. విశ్వవిద్యాలయంతో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ఉంటుంది. వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ప్రక్రియ నిర్వహిస్తారు. అభ్యర్థులు ఉదయం 9.30 నుంచి 11 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సీట్లు, ఫీజు వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు.

-న్యూస్‌టుడే, రాజానగరం

5న కేంద్ర మంత్రి జిల్లా పర్యటన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రి బన్వారీలాల్‌వర్మ 5న జిల్లాలో పర్యటిస్తారని జేసీ రాహుల్‌మీనా తెలిపారు. ఆయన పర్యటనపై కలెక్టరేట్‌లో జేసీ మంగళవారం ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఆగస్టు 1 నుంచి 7 వరకు నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించిన శిబిరాల్లో దివ్యాంగులు వివిధ పరికరాలకు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరికి కేంద్ర మంత్రి ఉపకరణాలు పంపిణీ చేస్తారన్నారు. కాకినాడ నగరం, గ్రామీణం నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసే శిబిరాల్లో ఆయన దివ్యాంగులకు పరికరాలను అందజేస్తారని తెలిపారు. మిగతా నియోజకవర్గాల్లో నిర్వహించే శిబిరాల్లో స్థానిక ఎమ్మెల్యేల చేతుల మీదుగా దివ్యాంగులకు పంపిణీ చేస్తారన్నారు.

2,68,597 మందికి పింఛన్ల పంపిణీ

బాలాజీ చెరువు(కాకినాడ), న్యూస్‌టుడే: జిల్లాలోని 21 మండలాల పరిధిలో మంగళవారం 2,68,597 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం ద్వారా రూ.113.03 కోట్ల సొమ్ము అందజేశారు. మొదటిరోజు రాత్రి 8 గంటలకు 97.43 శాతం మేర పింఛన్ల పంపిణీ జరిగింది. ఈనెలకు 2,75,679 మందికి రూ.116.03కోట్లు పింఛను ప్రభుత్వం విడుదల చేసింది. మంగళవారం ఉదయం 5.30 గంటల నుంచి 4,857 మంది సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల ఉద్యోగుల ద్వారా ఇళ్ల వద్దే లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. తొలిరోజు పింఛను సొమ్ము పొందని లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేసినట్లు డీఆర్‌డీఏ ఇన్‌ఛార్జి పీడీ కె.శ్రీరమణి చెప్పారు.

అన్ని ప్రాంతాల్లో 'స్వచ్ఛతా దివస్'

కాకినాడ కలెక్టరేట్: గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో బుధవారం స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమాలు నిర్వహించాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. గతనెల 17 నుంచి చేస్తుండగా ముగింపును ఘనంగా చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులను సత్కరించాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, జడ్పీ డిప్యూటీ సీఈవో రామ్‌కుమార్, దివ్యాంగుల శాఖ ఏడీ నారాయణమూర్తి, జీజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

98 శాతం ఓటర్ల తనిఖీ పూర్తి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఇంటింటా ఓటర్ల జాబితా తనిఖీ 98 శాతం పూర్తయ్యిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి షాన్‌మోహన్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ అమరావతి నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 రూపకల్పన కార్యక్రమంపై కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. సెప్టెంబరు 30 నాటికి జిల్లాలోని 1,637 పోలింగ్ కేంద్రాల పరిధిలో 16,34,513 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన ప్రక్రియను బూత్‌స్థాయి అధికారులు ఇంటింటా సర్వే ద్వారా చేపడుతున్నారన్నారు. మార్పులు, చేర్పులు, మరణాలకు సంబంధించి 10,608 దరఖాస్తులు నమోదు అయ్యాయని తెలిపారు. జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, కలెక్టరేట్ ఎన్నికల ఉప తహసీల్దారు ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని దీక్షలు

(బాలాజీ చెరువు)కాకినాడ, న్యూస్‌టుడే: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ ప్రతినిధులు దువ్వ శేషబాబ్జీ, సీహెచ్.రాజ్‌కుమార్, తోకల ప్రసాద్, పెద్దిరెడ్డి సత్యనారాయణ దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. స్టీల్ ప్లాంట్ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. స్టీల్‌ప్లాంటుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 లక్షల కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై శ్రద్ధ పెట్టాలన్నారు. తొలిరోజు దీక్షను సీఐటీయూ ప్రతినిధి పలివెల వీరబాబు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగసూరిబాబు, విద్యార్థి జేఏసీ ప్రతినిధి బులిరాజు, పీడీఎస్‌యూ(వి) జిల్లా కన్వీనర్ దుర్గాప్రసాద్, తదితరులు దీక్షలో పాల్గొన్నారు.



దీక్షలో విద్యార్థి, యుజన సంఘాల ప్రతినిధులు

125 యూనిట్ల రక్త సేకరణ

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 125 యూనిట్ల రక్తాన్ని సేకరించి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందించామని ప్రిన్సిపల్ డా.తిరుపాణ్యం మంగళవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు శిబిరాన్ని ప్రారంభించారు. కళాశాల హెల్త్‌క్లబ్, రెడ్ రిబ్బన్ క్లబ్, జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగింది. వైస్ ప్రిన్సిపల్ కె.ఆంజనేయులు, డా.కె.జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చౌక దుకాణాలా..! కొంచెం ఆగండి

ఒకేచోట రెండువేల కార్డులు..

సామర్లకోట మండలం, పనసపాడు గ్రామంలో ఒకే రేషన్‌షాపు ఉండగా, ఇక్కడ రెండువేలకు పైగా కార్డులున్నాయి. కాకినాడ గ్రామీణ మండలం కొవ్వూరులో ఒక దుకాణం పరిధిలోనూ ఇదే పరిస్థితి. వీటిని విభజించి, కార్డుదారులకు సమీపంలో మరో చౌక దుకాణం ఏర్పాటు చేయాలని భావించారు. ఇలా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒకే దుకాణం పరిధిలో వెయ్యికి పైగా కార్డులున్నాయి. ఇలాంటి చోట కొత్త చౌక దుకాణం ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ నిలిచింది.

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రేషన్‌కార్డుల విభజన, కొత్త చౌక దుకాణాల ఏర్పాటు, దీర్ఘకాలంగా ఉన్న ఖాళీల భర్తీకి తాత్కాలికంగా బ్రేక్ పడింది. కార్డుదారుకు సమీపంలోనే చౌక దుకాణాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఒక్కో చౌక దుకాణం పరిధిలో కార్డుల సంఖ్య సమానంగా చేసి, డీలర్లు, కార్డుదారులకు మేలు చేయాలని సంకల్పించింది. ఈ ప్రక్రియను పౌరసరఫరాల, రెవెన్యూశాఖ అధికారులు దాదాపు పూర్తి చేశారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

మండలాలు	21
చౌక దుకాణాలు	1,060
కార్డులు	6.54 లక్షలు
ప్రతిపాదించిన కొత్త దుకాణాలు	165

కొత్తగా 165 దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 133 చౌక దుకాణాలకు ఎన్నో ఏళ్లుగా డీలర్లు లేరు. వీటిని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇన్‌ఛార్జి పేరుతో నిర్వహిస్తున్నారు. వీటికి శాశ్వత ప్రాతిపదికన డీలర్ల భర్తీకి కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు నోటిఫికేషన్లు ఇవ్వడానికి సిద్ధం చేశారు. ఈ ప్రక్రియను నిలిపివేయాలని పౌరసరఫరాల కమిషనరేట్ నుంచి జిల్లా అధికారులకు మంగళవారం ఉత్తర్వులు అందాయి.



కాకినాడ అర్బన్‌లో చౌక దుకాణం

రేషన్ డీలర్ల వినతి మేరకు..

కార్డుల సంఖ్య తగ్గిపోతే జీవనోపాధి దెబ్బతింటుందని రేషన్ డీలర్ల సంఘ ప్రతినిధులు కూటమి ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. వినతులు అందజేశారు. ఈ ప్రక్రియల్లో ఉన్న లోపాలు సరిదిద్ది, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని వేడుకున్నారు. ఆ మేరకు పూర్తిస్థాయిలో పరిశీలించి, అమలు చేయాలని భావిస్తోంది. ఈ క్రమంలో తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ న్యూస్‌టుడేకు తెలిపారు. త్వరలో అమలయ్యే అవకాశం ఉందన్నారు.

మరికొన్ని రోజులు ఎండీయూలే..

ఇంటింటా రేషన్ పంపిణీ పేరుతో గత వైకాపా ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తెచ్చింది. ఆ పార్టీ కార్యకర్తలకే వీటిని కట్టబెట్టింది. ఒక్కోదానికి రూ.7లక్షలు చొప్పున జిల్లాలో 420 ఎండీయూలకు రూ.30కోట్లు ఖర్చు చేశారు. ఈ వ్యవస్థ లేనప్పుడు జిల్లాలో 95 శాతం కార్డులకు చౌక దుకాణాల ద్వారా సరకులు అందేవి. ఇవి వచ్చాక 90 శాతం కార్డులకే అందుతున్నాయి. దీంతో ఈ వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో మరికొన్ని నెలలు ఎండీయూ వాహనాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఏడేళ్లు.. వాహనదారికి కన్నీళ్లు

పెద్దాపురం, న్యూస్‌టుడే: 2017 సంవత్సరంలో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో పెద్దాపురం నుంచి జె.తిమ్మాపురం వరకు సీఆర్ఎఫ్ నిధులు సుమారు రూ.11 కోట్ల వ్యయంతో 6 కిలోమీటర్ల ర.భ.శాఖ రహదారి నిర్మాణం చేపట్టారు. 2019లో ఎన్నికలు రావడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ రహదారిని ఏ మాత్రం పట్టించుకోలేదు. పనులు చేపట్టిన గుత్తేదారుడికి ఇంకా సుమారు రూ.3.50 కోట్ల బిల్లులు బకాయి ఉన్నాయి. దీంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఇటు పెద్దాపురం, సామర్లకోట, కాకినాడ, అటు జగ్గంపేట, ఏలేశ్వరం, గోకవరం, వై. రామవరం, రంపచోడవరం, అడ్డతీగల, భద్రాచలం వంటి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గం. రహదారిపై గుంతలు చెరువుల్లా మారి ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఇన్‌ఛార్జి డీఈఈ ఏఎస్ఎస్ ప్రకాశరావును వివరణ అడగ్గా రోడ్డు పనులు చేపట్టడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలో చేపట్టి పూర్తిచేస్తామని తెలిపారు.



గుంతలతో చెరువులా మారిన పెద్దాపురం-కట్టమూరు వెళ్లే రహదారి

బాధ్యతల స్వీకరణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు సీహెచ్.గణపతి కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నం జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎంగా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గణపతి

11న లాటరీ ద్వారా మద్యం దుకాణాల ఎంపిక

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: జిల్లాలో 155 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు కాకినాడ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.కృష్ణకుమారి తెలిపారు. కాకినాడ నార్త్ ఎక్సైజ్ స్టేషన్‌లో మంగళవారం ఆమె వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం గతనెల 30న ఇచ్చిన ఉత్తర్వుల మేరకు 2024-26 కాలానికి నూతన మద్యం పాలసీని ప్రకటించారన్నారు. అక్టోబర్ 1 నుంచి 9వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను http://hpfsproject.com ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్ పద్ధతిలో ఎక్సైజ్ స్టేషన్లలో ఇవ్వొచ్చన్నారు. కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్‌లో ఈనెల 11న లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. అదే రోజు దరఖాస్తుదారులకు తెలియజేస్తామన్నారు. దరఖాస్తుదారు నిర్దేశిత మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీ, మండలాల యూనిట్లలో నోటిఫై చేసిన దుకాణాలకు రూ.2 లక్షలు నాన్ రిఫండబుల్ రుసుం చెల్లించాలన్నారు. కాకినాడ నార్త్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.రామ్మోహన్‌రావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జె.మౌనిక, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ కృష్ణకుమారి

క్రీడా వికాస కేంద్రాల పనుల్లో కదలిక

రాజానగరం నియోజకవర్గం సీతానగరంలోని పువ్వాడ సత్యనామం స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.2 కోట్లతో క్రీడా వికాస కేంద్రం మంజూరు చేసి రూ.25 లక్షలు విడుదల చేసింది. గుత్తేదారు ఉత్సాహంగా పనులు మొదలుపెట్టారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నాలుగేళ్లపాటు వాటి గురించి పట్టించుకోలేదు. ఎన్నికల వేళ రూ.45 లక్షలు మంజూరు చేసి పూర్తి చేస్తున్నామంటూ హడావుడి చేసింది. ఎనిమిది నెలలు గడిచినా పనులు పూర్తికాలేదు. మార్చి 24న శిలాఫలకంపై వైకాపా నేతల పేర్లు వేసుకుని ప్రారంభించారు. ...

- న్యూస్‌టుడే, సీతానగరం

వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో క్రీడారంగాన్ని నిర్లక్ష్యం చేసింది. అంతకు ముందున్న తెదేపా ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులను పక్కన పెట్టేసింది. ... ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి తెచ్చేందుకు ... 36 క్రీడావికాస కేంద్రాలకు రూ.23 కోట్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపారు.



రాజమహేంద్రవరం నాగులచెరువు వద్ద అసంపూర్తిగా క్రీడా వికాస కేంద్రం పనులు

ఒక్కో కేంద్రానికి రూ.2 కోట్లు

2014-19 మధ్య తెదేపా అధికారంలో ఉన్న సమయంలో ప్రతి నియోజకవర్గం లోను క్రీడా వికాస కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. మొదటి దశలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 చోట్ల క్రీడావికాస కేంద్రాలు, మరో మూడుచోట్ల క్రీడా ప్రాంగణాల పనులు ప్రారంభించారు. కాకినాడ, ద్రాక్షారామ, సామర్లకోట, కొత్తపేట, రామచంద్రపురం, దేవరపల్లి, పిఠాపురం, గోకవరం, దివాన్‌చెరువు తదితర చోట్ల ఒక్కో క్రీడా వికాస కేంద్రానికి రూ.25 లక్షలు చొప్పున విడుదల చేసి పనులు ప్రారంభించారు. అప్పట్లోనే సామర్లకోట, ద్రాక్షారామ, తుని కేంద్రాల నిర్మాణం పూర్తయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా క్రీడా వికాస కేంద్రాల పనులను పక్కన పెట్టేసింది. ఉమ్మడి జిల్లాలో 16 శాతం, కొవ్వూరు స్విమ్మింగ్ పూల్ 25 శాతం పనులతో అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ఉమ్మడి జిల్లాలో..

జిల్లా	క్రీడావికాస కేంద్రాలు	నిధులు (రూ.కోట్లు)
తూర్పుగోదావరి జిల్లా	04	8.5
కాకినాడ	03	6.5
అంబేడ్కర్ కోనసీమ	03	6.2

శాప్ ఇంజినీరింగ్ విభాగానికి బాధ్యతలు

క్రీడావికాస కేంద్రం పనుల పర్యవేక్షణ బాధ్యతలు ర.భ.శాఖతోపాటు వేర్వేరు శాఖలకు గతంలో అప్పగించారు. తాజాగా ఆయా శాఖలను తప్పించి శాప్ ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నారు. గతంలో క్రీడా వికాస కేంద్రం పూర్తిచేసిన శాప్ చేతికి రావాలంటే ఏళ్లు పట్టేది. క్వాలిటీ కంట్రోల్ నివేదికలు వచ్చిన తర్వాతే పనుల పర్యవేక్షణ చేపట్టే అవకాశం ఉంది. ... శాప్ సుంచి మళ్లీ ఆయా జిల్లాల స్పోర్ట్స్ అథారిటీలకు అప్పగించేవారు.

వేగవంతం చేయిస్తున్నాం..

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా నిలిచిన క్రీడావికాస కేంద్రాల పనులు వేగవంతం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. సీతానగరంలోని క్రీడావికాస కేంద్రం పనులు 90 శాతం పూర్తికావడంతో ముందుగా దాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. రాజమహేంద్రవరంలోని నాగులచెరువు వద్ద ఉన్న కేంద్రం నిర్మాణాన్ని పూర్తిచేయించి అప్పగించేందుకు ... 6 నెలలు కాలవ్యవధిలోగా ఇవన్నీ పూర్తిచేసేలా శాప్ ముందుకెళ్తోంది.

- టీఎంఎం శేషగిరి, డీఎస్‌డీవో

అర్జీలు వెంటనే పరిష్కరించాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా, సీసీఎల్ఏ, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులతో అమరావతి నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి కలెక్టరేట్ నుంచి జేసీ రాహుల్‌మీనా, అధికారులు హాజరయ్యారు. ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఫ్రీహోల్డ్ చేసిన భూముల పరిశీలన, ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారం, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియలు చేపట్టాలన్నారు. సమావేశంలో రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బి.శివరామ్, జిల్లా రిజిస్ట్రారు కె.ఆనందరావు, పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి, తదితరులు పాల్గొన్నారు.



అక్కా కాకినాడ పీజీ క్యాంపస్‌లో గాంధీ జయంతి

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణం తిమ్మాపురంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ పీజీ క్యాంపస్‌లో మంగళవారం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ కోఆర్డినేటర్ కొమ్మర జోసెఫ్‌స్టీఫెన్ ఆధ్వర్యంలో ముందస్తు గాంధీ జయంతి నిర్వహించారు. మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్రం.. మహాత్ముడి రూపం

గాంధీజీ జీవిత చరిత్ర, ఆయన స్వాతంత్య్ర ఉద్యమ ఘటనలు, త్యాగాల గురించి గొల్లప్రోలు మండలం చెందుర్తి ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు విద్యార్థులకు మంగళవారం వివరించారు. లీఫ్ కార్వింగ్ కళ ద్వారా రావి ఆకుపై మహాత్ముడి చిత్రం రూపుదిద్ది ప్రదర్శించడంతో పాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఆయన్ను హెచ్‌ఎం సురేష్‌కుమార్ తదితరులు అభినందించారు.



- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

3 నుంచి లోవలో దసరా ఉత్సవాలు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో ఈనెల 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు ఈనెల 12 వరకు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేయనున్నట్లు దేవస్థానం ఈవో, డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు. మహోత్సవాల్లో దర్శనానికి లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు.



శ్రీపీఠంలో ఏర్పాట్లు..

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలోని శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 13వ తేదీవరకు మహాశక్తియాగం-2024లో భాగంగా దుర్గాష్టమి రోజున 64 మంది భక్తులతో ఒకే ప్రాంగణంలో శ్రీలలితా సహస్రనామ పారాయణం, పూజలకు సిద్ధం చేస్తున్నారు. రోజుకు 30 వేల మంది భక్తులకు కుంకుమ పూజలు, 9న 24 వేల మంది భక్తులతో సరస్వతి పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు, సర్పవరం సీఐ పెద్దిరాజు ఉత్సవ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు, సర్పవరం సీఐ పెద్దిరాజు



ప్రాయశ్చిత్త.. పారాయణం

గొల్లప్రోలు: హిందూ దేవాలయ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా గొల్లప్రోలులోని విష్ణాలయంలో గొల్లప్రోలు టీమ్ జనసేన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. నారాయణ మంత్రం, సుందరకాండ పారాయణం చేశారు. మెట్లకు బొట్లు పెట్టారు. సీతారామస్వామిని దర్శించుకున్నారు.

విద్యుత్తు కోతతో ప్రభుత్వాసుపత్రిలో ఇక్కట్లు

సామర్లకోట, న్యూస్‌టుడే: ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్తు కోతతో సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం రోగులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఆసుపత్రిలో జనరేటర్ ఉన్నప్పటికీ దానిని వినియోగించకపోవడంతో బాలింతలు, వృద్ధులు, చిన్నపిల్లలు పడరాని పాట్లు పడ్డారు. వైద్యులు ఉన్నప్పుడే జనరేటర్ వినియోగిస్తున్నారని లేకపోతే వేయడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ అమలను వివరణ కోరగా ఆసుపత్రిలో విద్యుత్ పోయినప్పుడు ఇన్వర్టర్‌లు పనిచేస్తున్నాయని, తర్వాత జనరేటర్ వేస్తామన్నారు. ఆపరేషన్లు ఉన్నప్పుడు వెంటనే జనరేటర్ వేస్తామని తెలిపారు. జనరేటర్‌కి గంటకు రూ.వెయ్యి ఆయిల్‌కి ఖర్చు అవుతోందని ఎక్కువ సేపు విద్యుత్ కోత ఉంటేనే దానిని వినియోగిస్తామన్నారు. కొంత సేపు విద్యుత్ లేకపోవడంతో వైద్యులు విసురుకుంటూ వైద్య సేవలు అందించారని.. రోగుల సహాయకులు విసురుకున్నారన్నారు. తక్షణం ఆయిల్ రప్పించి జనరేటర్ వేసినా కావాలని కొంత మంది బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైద్యులు ఉన్నప్పుడే జనరేటర్ వేయడం అనేది వాస్తవం కాదని వివరణ ఇచ్చారు.



విసనకర్రలతో రోగులు, సహాయకులు

రైల్వేలో ఆర్నెళ్లకోసారి పోస్టుల భర్తీ జరగాలి

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రైల్వేలో ఆరు నెలలకోసారి ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియ జరగాల్సిన అవసరం ఉందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్(ఎస్‌సీఆర్ఎంయూ) ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్(ఏఐఆర్ఎఫ్) కోశాధికారి సి.హెచ్. శంకరరావు అన్నారు. డిసెంబరు 4, 5, 6 తేదీల్లో రైల్వే కార్మిక సంఘాలకు జరిగే గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన పర్యటించారు. సీఅండ్‌డబ్ల్యూ ఎస్ఎస్ఈ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో అన్ని విభాగాల్లో కలిపి ప్రస్తుతం 2 లక్షల ఖాళీలు ఉన్నాయన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య పెరగాల్సి ఉందన్నారు. ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేసే సిబ్బందికి ఎక్కువ సమస్యలున్నాయన్నారు. ట్రాక్‌పై పనిచేసే కార్మికులను స్కిల్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. గర్భిణులుగా ఉన్న మహిళా లోకో పైలట్‌లు రైలు ఎక్కి దిగే సమయంలో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వీరిని వేరే విభాగాల్లో పెట్టాలని, సేఫ్టీ రివ్యూ కమిటీ సిఫార్సుల మేరకు లోకోపైలట్లకు ఆరు గంటలు, ఎనిమిది గంటల పనివిధానాన్ని అమలు చేయాలని కోరారు. కొన్ని విభాగాలకు రిస్క్ అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. యార్డ్‌లో పనిచేసే పాయింట్స్ మేన్‌కు ఉద్యోగోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. బాక్స్ బాయ్స్ వ్యవస్థ పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమి కేటాయించినందున రాష్ట్రంలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ వెంటనే ప్రారంభించాలని కోరుతున్నామని, దీనికి దసరాలోపు శంకుస్థాపన జరిగే అవకాశం ఉందని శంకరరావు చెప్పారు. కార్యక్రమంలో హిందూ మజ్దూర్ సభ(హెచ్ఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఎన్.శ్రీనివాస్, ఎస్‌సీఆర్ఎంయూ విజయవాడ డివిజనల్ కార్యదర్శి ఎం.లీల, డివిజన్ అధ్యక్షుడు రామ్‌గుప్తా, అదనపు డివిజన్ కార్యదర్శి కె.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

సైన్స్‌తోనే ప్రగతి సాధ్యం

గొల్లప్రోలు: సైన్స్‌తోనే ప్రగతి సాధ్యమని, ప్రశ్నించేతత్వంతో వాస్తవాలు నిర్ధారించుకోవచ్చని పెద్దాపురం డీవైఈవో వెంకటేశ్వరరావు తెలిపారు. గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ప్రతిభ పరీక్షల ప్రశ్నపత్రాలు మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సత్యనారాయణరెడ్డి, శివప్రసాద్, సూర్యప్రకాశరెడ్డి, పద్మనాభం, నానిబాబు, సీతారామరాజు, ఉమారాజ మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో జవివే ప్రతినిధులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన కాకినాడ పీఆర్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు కేవీవీ సత్యనారాయణ మంగళవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎస్‌జీఎఫ్ నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-14, 17 విభాగాల్లోని హాకీ పోటీల్లో పి.సాయిలక్ష్మి(10వ తరగతి), మానస (8వ తరగతి) ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. సాలిపేట బాలికోన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ఎ.నవ్య సుష్మశ్రీ (10వ తరగతి) జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిందన్నారు. చిత్రలేఖన పోటీల్లో బి.దాలి సత్యహేమ(10వ తరగతి) జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి కైవసం చేసుకుందన్నారు. జిల్లా డీసీఈబీ కార్యదర్శి వెంకటరావు, పాఠశాల పీడీ మస్తానీ బేగమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి పింఛను సొమ్ము చోరీ

పిఠాపురం, న్యూస్‌టుడే: జగ్గయ్యచెరువుకు చెందిన గోపాలపు అనంతలక్ష్మి మంగళవారం ఉదయం పింఛనుకోసం తన మనవడిని వెంట తీసుకుని సచివాలయం-11కు వచ్చారు. కాసేపు నిరీక్షించాక పింఛను సొమ్ము అందింది. అప్పటికే ఇంటికి వెళ్లిపోయిన మనవడికోసం ఎదురుచూస్తుండగా పరిచయం లేని ఓ వ్యక్తి వచ్చి ఇంటి వద్ద దించుతానని చెప్పి ఆమెను ద్విచక్ర వాహనం ఎక్కించుకున్నాడు. వేరే దారిలో వెళ్తుండడంతో నిలదీయగా అతను రూ.4 వేల పింఛను సొమ్ము లాక్కుని, ద్విచక్ర వాహనంపైనుంచి తోసేయడంతో ఆమె గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు దర్యాప్తు ఆరంభించారు. విషయం తెలుసుకున్న పురపాలిక కమిషనర్ కనకారావు సొంత సొమ్ము రూ.4 వేలను సచివాలయ సిబ్బందితో ఆమెకు అందించారు.



బాధితురాలు అనంతలక్ష్మి

విధుల్లో చేరిన మున్సిపల్ డీఈ

పిఠాపురం: పిఠాపురం మున్సిపల్ డీఈ భవానీశంకర్ విధుల్లో చేరారు. సస్పెన్షన్‌కు గురైన డీఈ కోర్టును ఆశ్రయించగా, అక్కడ ఇచ్చిన ఉత్తర్వులు తీసుకొచ్చి కమిషనర్ కనకారావుకు మంగళవారం అందజేశారు. ఆగస్టు 31న జరిగిన కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ కనకారావు, డీఈ భవానీశంకర్ బాహాబాహీకి దిగిన విషయం తెలిసిందే. కౌన్సిల్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చే క్రమంలో వీరిద్దరూ కొట్లాడుకున్నారు. దాంతో అదేరోజు డీఈని ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీ గోపాలకృష్ణారెడ్డి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దాంతో భవానీశంకర్ కోర్టుకు వెళ్లారు. ఆ మేరకు తిరిగి విధుల్లో చేర్చుకోవాలని కోర్టు అనుమతులు ఇచ్చిందని తెలిపారు.



డీఈ భవానీశంకర్ తెచ్చిన కోర్టు ఉత్తర్వులను పరిశీలిస్తున్న కమిషనర్

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	12,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	16,000-17,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు (కిలోకు)



గాంధీనగర్: టమాటా - 36, వంకాయలు - 36,50, బెండకాయలు - 34, పచ్చిమిర్చి - 28,34, కాకరకాయ - 35, బీర - 34,42, కాలీఫ్లవర్ - 20,25, క్యాబేజీ - 35, క్యారెట్ - 36,40, దొండకాయలు - 36,44, బంగాళాదుంపలు - 30,36, ఉల్లి - 52,56, గోరుచిక్కుళ్లు - 32, దోసకాయలు - 34, ఆనపకాయ - 25,30, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుళ్లు - 56, చేమదుంపలు - 44, మునగకాడలు - 12,15, బీట్‌రూట్ - 32, కీరదోస - 30, బీన్స్‌కాయలు - 74, అల్లం - 50, క్యాప్సికం - 64, బొబ్బర్లు - 56, చిలకడదుంపలు - 44, మామిడికాయ - 15,18, నిమ్మకాయలు(డజన్) - 24,60.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4ప్లెక్స్- దేవర పార్ట్ 1, సత్యం సుందరం, 35, దేవీ మల్టీప్లెక్స్ 4ప్లెక్స్- దేవర పార్ట్ 1, సత్యం సుందరం, 35, లక్ష్మి- దేవర పార్ట్ 1, సత్యగౌరి- దేవర పార్ట్ 1, తిరుమల - దేవర పార్ట్ 1, సీలింక్ 1- మత్తువదలరా 2, సీలింక్ 2- దేవర పార్ట్ 1, శ్రీప్రియ - ఆయ్, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1 (వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- దేవర పార్ట్ 1, శ్రీశ్రీనివాస(తేలంగి)- దేవర పార్ట్ 1.

అభివృద్ధి ప్రదాత బాలయోగి




బాలయోగి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: జడ్పీ ఛైర్మన్ నుంచి లోక్ సభ స్పీకర్ స్థాయికి ఎదిగిన జీఎంసీ బాలయోగి అభివృద్ధి ప్రదాత అని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక యానాం రోడ్డు బాలయోగి సెంటర్ వద్ద ఆయన 73వ జయంతిని నిర్వహించారు. నగర తెదేపా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండబాబు పాల్గొన్నారు. బాలయోగి విగ్రహానికి దళిత నాయకులతో కలిసి నివాళి అర్పించారు. అనంతరం యానాం-ఎదుర్లంక వంతెన, కత్తిపూడి పామర్రు జాతీయ రహదారి బాలయోగి హయాంలోనే జరిగాయన్నారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ మంజూరు చేయించింది ఆయనేనని గుర్తు చేశారు. బొప్పె దేవరాజు, సీకోటి అప్పలకొండ, గంటి సత్తిబాబు, అంబటి చిన్న, ఎంపీ ఆర్జునరావు, గుత్తుల రమణ, పలివెల లక్ష్మి, గొరుసు దుర్గారావు, కస్తూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా హామీల అమలు..

కాకినాడ నగరం: ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా హామీ మేరకు సీఎం చంద్రబాబు సామాజిక పింఛన్లు పెంచి, 1వ తేదీనే అందిస్తున్నారని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు గుర్తుచేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 21వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీని కొండబాబు మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైకాపా పాలనలో పింఛన్ల పంపిణీని వాలంటీర్లతో హడావుడి చేసేవారన్నారు. తెప్పల రామలింగేశ్వరరావు, బూడి ప్రకాష్, దుర్గాప్రసాద్, అయేషా, అన్వర్, ఇమామ్, సాహెబ్ పాల్గొన్నారు.

మహాత్ముడు.. నడయాడిన నేల



పైడా వెంకట నారాయణ మేడపై గాంధీజీ

గాంధీనగర్, న్యూస్‌టుడే: మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ.. ఆయన మాటే మంత్రం. పిలుపే ప్రభంజనం. స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో రెండుసార్లు కాకినాడకు వచ్చారు. ఆయన కోసం జనం ఉప్పెనలా వచ్చారు. ఆ మహనీయుడి స్ఫూర్తి భావి తరాలకు అందాలని గాంధీభవన్ రూపంలో ఏర్పాటు చేశారు. అవి ఇప్పటికీ మధుర స్మృతులుగా నిలుస్తున్నాయి.

రైల్వేస్టేషన్ నుంచి బయటకు వచ్చేందుకు గంట..

గాంధీజీ మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీల్లో విజయవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా కాకినాడ, పెద్దాపురం, రాజమహేంద్రవరాలకు వచ్చారు. 1921 మార్చి 3న కాకినాడ రైల్వేస్టేషన్‌కు గాంధీజీ, ఆయన సతీమణి కస్తూరిబాతో కలిసి వచ్చారు. కాకినాడ రైల్వేస్టేషన్ నుంచి బయటకు రావడానికి గంటకు పైగా సమయం పట్టిందంటేనే ఆనాటి జన సందోహన్ని అంచనా వేయొచ్చు. వారికి దేశ భక్త కొండా వెంకటప్పయ్య, మహర్షి బులుసు సాంబమూర్తి, స్వాతంత్ర్య సమరయోధుడు గంటి సుబ్బారావు, పైడా వెంకట నారాయణ తదితరులు ఘన స్వాగతం పలికారు. దేవాలయం వీధిలోని పైడా వెంకట నారాయణ డాబాపై నుంచి మహాత్ముడు ప్రసంగించారు.



గాంధీభవన్‌లో కాంస్య విగ్రహం



చిత్రాల ప్రదర్శన



నాటి ఎల్విన్‌పేట.. నేటి గాంధీనగర్..

ఆనాటి ఎల్విన్‌పేట సమీపంలోని ప్రదేశం, నేడు గాంధీనగర్ పార్కు ఉన్న ప్రాంతాన్ని బాపు ప్రసంగించేందుకు సభా ప్రాంగణంగా తీర్చిదిద్దారు. మహాత్ముడి ఉపన్యాసాన్ని బులుసు సాంబమూర్తి తెలుగులోకి తర్జుమా చేశారు. పింగళి వెంకయ్య తయారు చేసిన స్వదేశీ ఖద్దరు బట్టపై రాసిన నినాదాలతో సభా ప్రాంగణ ప్రదేశాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ ప్రాంతానికి గాంధీనగర్‌గా పేరు పెట్టారు.

నేటికీ శిక్షణ కార్యక్రమాలు..

రెండోసారి పర్యటనలో భాగంగా 1933లో ప్రస్తుతం గాంధీభవన్ ఉన్న ప్రాంతాన్ని సందర్శించారు. అప్పట్లో గాంధీభవన్ ఉన్నచోట హరిజన్ హాస్టల్ పేరుతో హరిజనులకు విద్యావకాశాలు కల్పించేందుకు వసతి గృహం ఉండేది. హరిజన విద్యార్థులతో మాట్లాడిన గాంధీజీ గుర్తుగా గాంధీభవన్‌గా మార్చారు. కొమండూరి శఠగోపాలాచార్యులు, డాక్టర్ తనికెళ్ల సత్యనారాయణమూర్తుల ఆధ్వర్యంలో 1950లో గాంధీభవన్ ఏర్పాటు చేశారు. గాంధీ సిద్ధాంతాలు ఆచరిస్తూ నేటికీ ఆ ప్రాంగణంలో ఉపాధి శిక్షణ, మహిళలకు కుట్టు నేర్పించడం వంటి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. గాంధీభవన్‌లో మహాత్ముడి కాంస్య విగ్రహం, ఆయన జీవితంలోని అరుదైన ఫొటోలతోపాటు, అద్భుత సాహిత్యంతో కూడిన పుస్తకాలతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు.

29,455 మందికి పింఛన్ల పంపిణీ

కాకినాడ కలెక్టరేట్: నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో మంగళవారం 29,455 మంది లబ్ధిదారులకు రూ.12,47,05,500 ఎన్టీఆర్ భరోసా పింఛను అందజేశారు. 97.84 శాతం మందికి పంపిణీ చేశారు. ఈనెలకు నగరపాలక సంస్థ పరిధిలో 30,106 మందికి రూ.12,75,05,000 సొమ్ము విడుదలైంది. మంగళవారం ఉదయం 5.30 గంటల నుంచి వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఉప కమిషనర్ ఎస్.మనోహర్ పలు ప్రాంతాల్లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

దూర విద్య పీజీ ప్రవేశాలకు గడువు పెంపు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఆంధ్రా విశ్వవిద్యాలయం దూర విద్య ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరేందుకు గడువును నవంబరు 15 వరకు పొడిగించినట్లు పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.బి.తిరుపతిరావు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలోని దూర విద్య అధ్యయన కేంద్రంలో సంప్రదించాలన్నారు. లేదా www.andhrauniversity.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఆర్టీవోగా కిషోర్ సేవలు అభినందనీయం

కాకినాడ కలెక్టరేట్: బదిలీపై వెళ్తున్న కాకినాడ ఆర్టీవో ఇట్ల కిషోర్‌ను మంగళవారం ఆయన విడిది కార్యాలయంలో కాకినాడ నగర పౌర సంక్షేమ సంఘం సత్కరించింది. సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆయనకు గాంధీజీ చిత్రపటాన్ని బహూకరించారు. కాకినాడలో వినాయకసాగర్ పూర్వ వైభవానికి, సేలింగ్, అడ్వెంచర్ క్లబ్‌ల పరిరక్షణ చర్యలు తీసుకున్నారని తెలిపారు.

'వెంకటరత్నం నాయుడు' జీవితం ఆదర్శం

గాంధీనగర్, న్యూస్‌టుడే: విద్యావేత్త, ప్రముఖ సంఘ సంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడు సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. వెంకటరత్నం నాయుడు 162వ జయంతి సందర్భంగా ఆర్డీఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానంలోని రఘుపతి విగ్రహానికి వివిధ ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకినాడలో బ్రహ్మసమాజ స్థాపన ద్వారా ఆయన చేసిన సేవలను వివరించారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు, యూటీఎఫ్ సీనియర్ నేత కె.సత్తిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిచక్రవర్తి, సీహెచ్‌వి.రమణ, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

గాంధీనగర్: నగరంలోని అశోక్‌నగర్‌లోని శిర్డీ సాయిబాబా ఆలయంలో 3నుంచి 13 వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ వేదుల అచ్యుత రామారావు తెలిపారు. మంగళవారం ఆలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 6న విద్యార్థులు, బాలలతో సామూహిక సరస్వతి పూజ, 12న సర్వదేవతా హోమం, పూర్ణాహుతి, శమీపూజ, మహాబలిహరణ, 13న సాయిబాబా మహాసమాధి ఉత్సవాల సందర్భంగా సామూహిక సత్య వ్రతాలు జరుగుతాయన్నారు.

బాధ్యతల స్వీకరణ



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ నగరపాలక సంస్థ కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ నియమించారు. ఇక్కడ పనిచేసిన ఎం.ఏసుబాబు తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా వెళ్లారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మున్సిపల్ కమిషనర్ భావనను మర్యాదపూర్వకంగా కలిశారు.

వృద్ధులకు వైద్యపరీక్షలు

మసీదు సెంటర్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 10రోజుల పాటు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డా.నరసింహానాయక్ తెలిపారు. జనావళి స్వచ్ఛంద సేవా సంస్థ వృద్ధుల ఆశ్రమంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో చేతులమీదుగా పండ్లు అందజేశారు. డా.ప్రభాకర్, మెడికల్ అధికారి డా.అజీజ్, డా.శ్రీవిద్య, జి.శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో జీవించాలి

కాకినాడ నగరం: వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో జీవించాలని ఉమ్మడి జిల్లా ఉద్యోగ జేఏసీ మాజీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సలహాదారు రామారాయుడు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్ పార్కులో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్రాంత వ్యవసాయ శాఖ జిల్లా సంచాలకులు పాలడుగు సుబ్రహ్మణ్యాన్ని సత్కరించారు. సంఘ అధ్యక్షుడు ఎంవీవీ స్వామి, ఉపాధ్యక్షుడు నారాయణరావు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం రామారావు, కార్యదర్శి చలపతి, నాగరాజు, జగదీశ్వరరావు పాల్గొన్నారు.

పెద్దల జీవతం.. యువతకు ఆదర్శం

కాకినాడ కలెక్టరేట్: వృద్ధుల అనుభవాలు యువతకు మార్గదర్శకం కావాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. మంగళవారం మానవతా ఫౌండేషన్ ప్రాంగణంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని కాకినాడ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇక్కడున్న 30 మందితో ముచ్చటించారు. వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయనకు అసోసియేషన్ ప్రతినిధులు పలు సమస్యలు వివరించారు. అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బి.సూర్యనారాయణమూర్తి, సుధాకర్, జక్కా ప్రసాద్, కొరుప్రోలు గౌరీనాయుడు, పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులను సత్కరిస్తున్న జేసీ రాహుల్‌మీనా

రక్తదానంతో ప్రాణదాతలుగా మారాలి



శిబిరంలో జీజీహెచ్ సూపరింటెండెంట్, తదితరులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఆరోగ్యంగా ఉండేవారు రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి సూచించారు. మంగళవారం రక్తదాతల దినోత్సవం సందర్భంగా కాకినాడ ఆర్ఎంసీ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు, జీజీహెచ్ రక్తనిధి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా డా.లావణ్యకుమారితో పాటు ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డా.శశి హాజరై ప్రారంభించారు. జీజీహెచ్ రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డా.శారదాదేవి మాట్లాడారు. వైద్య విద్యార్థులు రక్తదానం చేయగా, మొత్తం 57 యూనిట్లు సేకరించామన్నారు. క్యాంప్ ఆర్గనైజర్ డా.తరుణ్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలూ.. పట్టాలపై ఆడొద్దు..



రైల్వే ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కాకినాడ టౌన్ రైల్వే రక్షణ దళం(ఆర్పీఎఫ్) సీఐ కొండయ్య సూచించారు. రామారావుపేటలోని జిల్లా పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం భద్రతా అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రైల్వే ట్రాక్‌ల వెంబడి నడవడం, పట్టాలపై రాళ్లు, ఇతర వస్తువులు పెట్టడం వంటివి చేయరాదన్నారు. అనుమానాస్పదంగా ఎలాంటి వస్తువులు కనిపించినా, ప్రమాదకర పరిస్థితులు కనిపించినా వెంటనే రైల్వే రక్షణ దళం అధికారులకు, సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. 139 రైల్వే హెల్ప్‌లైన్ ఆవశ్యకతను, రైల్వే చట్టాలను వివరించారు. ఏఎస్సై శివశంకర్, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

బాల రామాయణం



నగరంలోని శాంతినగర్, శశికాంత్‌నగర్ భాష్యం పాఠశాలల్లో దసరా ముందస్తు వేడుకలు మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు అమ్మవారు, వివిధ దేవతామూర్తుల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు బతుకమ్మ ఆడారు. పలువురు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయమే ఈ దసరా పండగ అని తెలిపారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

విశ్రాంత ఉద్యోగుల సాయం



వరదల కారణంగా నిరాశ్రయులైన బాధిత కుటుంబాల కోసం కాకినాడ ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగులు రూ.66,817 ఆర్థిక సాయాన్ని అందించారు. మంగళవారం కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఎల్‌డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో చెక్కు అందజేశారు. విశ్రాంత ఉద్యోగులు జె.సత్యనారాయణ, ఎన్.సత్యనారాయణ, వీఎస్ఎన్ మూర్తి, ఎస్‌వీవీ తాతారావు, ఆర్‌జీ రామారావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- వరద బాధితుల సహాయార్థం బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు సీఎం సహాయనిధికి రూ.10వేలు చెక్కు కలెక్టర్‌కు అందజేశారు. ట్రస్టీలు వీఎస్ఎన్ మూర్తి, వినయ్, సభ్యులు తాతారావు, వి.మల్లికార్జునరావు, రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

విద్యాభివృద్ధికి కృషి

మసీదుసెంటర్: మహిళల విద్యాభివృద్ధికి రఘుపతి వెంకటరత్నం నాయుడు కృషి చేశారని డా.అడ్డాల సత్యనారాయణ, డా.చిట్ల కిరణ్ అన్నారు. మంగళవారం రంగరాయ వైద్య కళాశాలలోని రఘుపతి విగ్రహానికి నివాళి అర్పించారు. దొరబాబు, వీరభద్రరావు, చలం, శ్రీమన్నారాయణ, డా.ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు 'మేజర్ యాక్ట్' పుస్తకాల పంపిణీ



మసీదు సెంటర్: మారిన కొత్త క్రిమినల్ చట్టాలను యువ న్యాయవాదులు నేర్చుకునేందుకు మేజర్ యాక్ట్ పుస్తకం దోహదపడుతుందని సీనియర్ న్యాయవాది, కాకినాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పేపకాయల రామకృష్ణ అన్నారు. మంగళవారం కాకినాడ బార్ అసోసియేషన్ భవనంలో పలువురు న్యాయవాదులకు పుస్తకాలు అందజేశారు. రోటరీ మాజీ గవర్నర్ లక్కరాజు సత్యనారాయణ(టిక్కు) చేతులమీదుగా 100కి ఇచ్చామన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

మసీదు సెంటర్(కాకినాడ): క్రీడలతో ఒత్తిడి దూరమవుతుందని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ముత్తింటి విశ్వేశ్వరరావు, చక్కా శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల రాజమహేంద్రవరంలో రాష్ట్రస్థాయి న్యాయవాదుల క్రీడా పోటీలు జరిగాయి. అందులో విజయం సాధించిన వారిని మంగళవారం కాకినాడ బార్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షకార్యదర్శులు, బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ, ఇతర సభ్యులు, సీనియర్ న్యాయవాదులు అభినందించారు. చదరంగంలో రన్నర్‌గా, క్యారమ్స్ సింగిల్స్ విజేతగా న్యాయవాది వై.వసంత నిలిచారన్నారు. క్యారమ్స్ డబుల్స్ విజేతలుగా వై.వసంత, షారోన్ రోజా నిలిచారన్నారు. పురుషుల బ్యాడ్మింటన్‌లో డబుల్స్ రన్నర్‌గా సందీప్, వినోద్‌లు నిలిచారన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి దొంతుమల్ల అశోక్‌కుమార్, బార్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

గాంధీనగర్: జమిలి ఎన్నికల విధానం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మాజీ పార్లమెంట్ సభ్యుడు మిడియం బాబూరావు పేర్కొన్నారు. కచేరీపేటలోని యూటీఎఫ్ హోంలో మంగళవారం రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జమిలి ఎన్నికలు- పర్యవసానాలు అంశంపై సదస్సు జరిగింది. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. దేశ బడ్జెట్‌లో ఎన్నికల వ్యయం నామమాత్రంగా ఉందన్నారు. ఎన్నికల కమిషన్‌ను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందన్నారు. సీఐటీయూ నగర కన్వీనర్ ఎం.వెంకటరమణ, స్టడీ సర్కిల్ కన్వీనర్ గోవిందరాజులు, యూటీఎఫ్, సీఐటీయూలతోపాటు పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బాబూరావు

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

కాకినాడ నగరం: మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని, సేవలందించాలని నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్టీఆర్ సతీమణి నందమూరి బసవతారకం, మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతిలను నిర్వహించారు. వారి చిత్రపటాలకు నివాళి అర్పించారు. దివ్యాంగులు, యాచకులు, నిరుపేదలకు అన్నదానం చేశారు. బత్తుల సూర్యప్రకాష్, కర్రి వీరబాబు, పోలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'స్వచ్ఛత' నిరంతర ప్రక్రియ

సాంబమూర్తినగర్: స్వచ్ఛతా హీ సేవ వారోత్సవాల్లో భాగంగా కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్, ఆర్పీఎఫ్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ అని.. ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కమర్షియల్, టెలికం, పార్సిల్ సిబ్బందితోపాటు రైల్వే పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కాకినాడ నగరం: పాఠశాలలు శుభ్రంగా ఉండాలని అర్బన్ ఎంఈవో సీహెచ్ రవి సూచించారు. గాంధీనగర్ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'స్వచ్ఛతా' ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంఈవో ప్రారంభించారు. బి.శ్రీనివాసరావు, యూబీ కుమారి, తురగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

కన్నతండ్రా.. కాల యముడా..!

గోడకేసి కొట్టడంతో 35 రోజుల శిశువు మృతి

మసీదు సెంటర్(కాకినాడ): ఆ పసికూన ఇప్పుడిప్పుడే లోకాన్ని చూస్తోంది. తల్లి పొత్తిళ్లల్లో హాయిగా నిద్రపోతోంది. పుట్టి కేవలం 35 రోజులే అయ్యింది. ఆడపిల్లగా పుట్టడమే తనకు శాపమైంది. కసాయి తండ్రి కోపానికి బలైపోయింది. తండ్రి గొంతునులిమి, గోడకేసి కొట్టడంతో ఆ ఆడ శిశువు మృతిచెందిన విషాద ఘటన మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. కాకినాడ 1వ పట్టణ సీఐ ఎం.నాగదుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం.. బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన కేతా శివమణికి గతంలోనే వివాహమైంది. భార్యతో విభేదాలు రావడంతో వేరుగా జీవిస్తున్నారు. ప్రస్తుతం కాకినాడలోని ఓ పండ్ల దుకాణంలో పనిచేస్తూ ఇక్కడే ఉంటున్నారు. అతడికి కాకినాడకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఆ మహిళకు గతంలోనే పెళ్లి కాగా భర్తతో విడిపోయింది. శివమణి, సదరు మహిళ నాలుగేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. వీరికి 35 రోజుల క్రితం ఆడ శిశువు పుట్టింది. బాలిక పుట్టడంతో వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. గొడవ పెరగడంతో శివమణి.. శిశువు గొంతు నులిమి, గోడకేసి కొట్టడంతో చిన్నారి మృతిచెందింది. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

సూపర్ బజార్ ఛైర్మన్‌గా ఆదినారాయణ



కాకినాడ నగరం, న్యూస్‌టుడే: సూపర్ బజార్ (ది కాకినాడ కన్జ్యూమర్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్) ఛైర్మన్‌గా పెసంగి ఆదినారాయణ ఎన్నికయ్యారు. మెయిన్ రోడ్డు సూపర్ బజార్ కార్యాలయంలో మంగళవారం ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా ఆర్ఎన్ సుధాకరరావు వ్యవహరించారు. సూపర్ బజార్ వైస్ ఛైర్మన్ వరిపల్లి కృష్ణవేణి, డైరెక్టర్లు యాళ్ల పట్టాభిరామయ్య, బత్తిన పైడి రాజు, మన్నే నాగేశ్వరరావు, ముమ్మిడి పవన్‌కుమార్, డీవీవీ ప్రసాద్, బి.బాలకృష్ణ, డీవీ ఆదినారాయణ, సంస్థ సీఈవో వి.శివాజీ గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకులు ఎస్ఆర్ఎంటీ యాజమాన్యం ఆశయాల సాధనకు, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన నగర ఎమ్మెల్యే కొండబాబు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రహదారిపై పశువుల తిష్ట




నగరంలోని పలు ప్రధాన రహదారులపై పశువులు తిష్ట వేస్తున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. భాస్కర్‌నగర్, గొడారిగుంట, సినిమారోడ్డు, పెదమార్కెట్, పాత బస్టాండ్, పులె కూడలి తదితర ప్రధాన రహదారుల్లో పశువులు అడ్డంగా పడుకుంటున్నాయి. పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో వాటిని చూసుకోక ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీటిని నియంత్రించాలని నగరవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదుసెంటర్

కి.మీ.దూరంలో 15 గుంతలు

కాకినాడ దుమ్ములపేట రైల్వేగేటు నుంచి కుంభాభిషేకం రేవు వరకు వెళ్లే రహదారి అధ్వానస్థితిలో ఉంది. సుమారు కి.మీ. పైగా ఉన్న ఈ మార్గంలో 15పైగా గుంతలు ఉన్నాయి. కుంభాభిషేకం రేవుతో పాటు సీ పోర్టు, ఇతర పరిశ్రమలకు నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు, కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత పాలకులకు ఎన్నోమార్లు సమస్య విన్నవించినా స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. వర్షం పడితే అవస్థలు అన్నీ, ఇన్నీ కావు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, సాంబమూర్తినగర(కాకినాడ)



కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

విద్యతోనే ఉజ్వల భవిత



కరపలో అవగాహన కల్పిస్తున్న ఎంఈవోలు

కరప: ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదివి ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని ఎంఈవోలు బులిశ్వ్రష్ణవేణి, సత్యనారాయణ సూచించారు. కరపలో మంగళవారం నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు యంగ్ మైండ్స్ సేవాసంస్థ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ నిర్వహించి, సూచనలందించారు. ఇందిర, వెంకటరమణ, అలీం, విశ్వేశ్వరరావు, మంగారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కరప మండలంలో 97.16 శాతం పింఛన్ల పంపిణీ

కరప, పెదపూడి: వాలంటీర్లు లేకపోయినా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒకటో తేదీనే లబ్ధిదారులందరికీ పింఛన్ల పంపిణీ జరుగుతోందని మండల తెదేపా అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు అన్నారు. పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడిలలో పంపిణీని ఎంపీడీవో అప్పారావు, ఈవోపీఆర్డీ సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. మండలంలో 97.16 శాతం అందించామని ఎంపీడీవో తెలిపారు. ✦ పెదపూడి మండలంలో మంగళవారం 95.76శాతం పింఛన్ల పంపిణీ చేశామని ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఎం.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మొత్తం 10495 పింఛన్లకుగాను 10050 పంపిణీ చేశామన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన జి.మామిడాడ విద్యార్థినులు

పెదపూడి: జి.మామిడాడ జడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనటానికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి మంగళవారం తెలిపారు. సత్యవేణి, జి.జి.సంధ్య, మి.ప్రవల్లిక, కె.హైమ విద్యార్థినులు ఇటీవల కాకినాడలో స్కూల్‌గేమ్స్ ఎంపికలలో ఎంపికయ్యారని, ఈ నెల 6న శ్రీకాకుళం జిల్లాలో జరిగే ఈ పోటీల్లో జిల్లా కబడ్డీ జట్టు నుంచి పాల్గొంటారన్నారు.

తాళ్లరేవు, కొత్తపల్లి, సామర్లకోట: కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్ట్, క్రాఫ్ట్ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ సాధించినట్లు నీలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రాధాకృష్ణ తెలిపారు. చిత్తూరి చాందినీ(ప్రథమ), రాయుడు స్వాతి (ద్వితీయ), జనిపల్లి రమ్యశ్రీ (తృతీయ)సాధించినట్లు చెప్పారు. క్రాఫ్ట్ ఉపాధ్యాయిని చిట్టూరి మంగతాయారును ఉపాధ్యాయులు అభినందించారు. ✦ స్కూల్ గేమ్స్ పోటీల్లో సామర్లకోటకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన జమ్మల ఈశ్వర్‌రెడ్డి జిల్లా స్థాయి ఖోఖో పోటీలో విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కే రాజన్నదొర తెలిపారు. బచ్చు ఫౌండేషన్ పాఠశాలకు చెందిన గౌతమ్, జి లక్ష్మీ వర్షిణి అండర్ 14 ఖోఖోలో, సీ హెచ్ కార్తీక్ అండర్ 17 కబడ్డీలో ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కే అరుణశ్రీ అండర్ 14 కబడ్డీ, జి శ్రీవల్లి అండర్ 17 కబడ్డీల్లో ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనామాధురి తెలిపారు. ✦ అండర్-17 కబడ్డీ పోటీల్లో వాకతిప్ప జడ్పీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కృపారావు మంగళవారం తెలిపారు. దడాల సజీవ్, తూటి దీపక్‌లు అండర్-17 విభాగం, పక్కుర్తి వెంకటసాయి అండర్-14 విభాగంలో ఎంపికయ్యారు. పీఈటీ నూకరజు అభినందించారు.

ఇంటింటా చెత్త సేకరణకు చర్యలు



ముఖా ముఖి

పిఠాపురం పురపాలక సంఘాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామని, ప్రజల సహకారం కోరుతున్నామని కమిషనర్ నామా కనకారావు తెలిపారు. 'న్యూస్‌టుడే'తో ముఖాముఖి మాట్లాడారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం

రోజుకు 25 మెట్రిక్ టన్నుల చెత్త..

పట్టణంలో 30 వార్డుల పరిధిలో 14,800 ఇళ్లున్నాయి. ఇళ్లు, వ్యాపార సముదాయాల నుంచి రోజుకు 25 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. సేకరణ సక్రమంగా జరక్క పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. అధిగమించేందుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనలతో ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశాం.

తరలింపు ఇలా..

చెత్త సేకరణకు 6 ట్రాక్టర్లు, 30 పుష్‌కార్ట్‌లు, 8 ఈ-ఆటోలు, 2 కాంపాక్టర్లున్నాయి. ఒక ట్రాక్టర్‌తో 2 నుంచి 3 టన్నుల చెత్తను మాధవపురంలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నాం. 15 మంది కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు.

రూ.40 లక్షలతో కాలువలు శుభ్రం

30 వార్డుల్లోనూ 172 కిలోమీటర్ల మేర మైనర్, 11 కిలోమీటర్ల మీడియం, 40 కిలోమీటర్ల పొడవున కచ్చా కాలువలున్నాయి. వీటి శుభ్రతకు ప్రత్యేక నిధులు రూ.42 లక్షలు మంజూరయ్యాయి. నెలరోజులుగా పూడిక తీత చేపట్టాం.

ఒక్కో కార్మికుడికి 300 ఇళ్లు..

చెత్త సేకరణకు 96 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఒక్కొక్కరు 300 ఇళ్ల నుంచి చెత్తను సేకరించిన తరువాత వాటిని మస్టర్ వేస్తున్నాం. ఈ-ఆటోలు 500 ఇళ్ల నుంచి చెత్త సేకరించేలా నిబంధన పెట్టాం. ట్రాక్టర్లు 1,500 ఇళ్ల వెళ్లి, వ్యర్థాలోనే అక్కర్నుంచి చేరుకుంటాం.

35 డంపింగ్ ప్రాంతాలు..

మాధవపురంలో ఐదెకరాల్లో డంపింగ్‌యార్డు ఉంది. ఐదేళ్ల కాలం ఎక్కడికక్కడే 35 చోట్ల చెత్తను వేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నట్లు గుర్తించాం. అగ్రహారం వాటర్ ట్యాంకు, కోర్టు ఏరియా, దత్త క్షేత్రం, పాదగయ పరిసరాలు, గండేపల్లి లేఅవుట్, మాధవపురం రోడ్డు తదితర ప్రాంతాల్లో గుర్తించి, శుభ్రం చేశాం.

సంపద సృష్టిపై దృష్టి..

తడి, పొడి చెత్త సేకరించి సేంద్రియ ఎరువుగా మార్చి సంపద సృష్టించేందుకు చర్యలు చేపడుతున్నాం. మెప్మా సిబ్బందిని భాగస్వాములను చేస్తున్నాం. ఇళ్లలో ఖాళీ స్థలం, మేడలపై కూరగాయలు పండించుకునేవారికి ఎరువు అందిస్తాం.

జగ్గయ్యచెరువు ప్రాంతంలో..

జగ్గయ్యచెరువు ప్రాంతం 3 వార్డుల పరిధిలో పది వేల జనాభాతో ఉంది. రహదారులు, కాలువలు లేక పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతోంది. ప్రత్యేక పర్యవేక్షకుడిని నియమించి చర్యలు చేపట్టాం.

బాలయోగికి నాయకుల ఘన నివాళి



తాళ్లరేవులో నివాళి అర్పిస్తున్న తెదేపా శ్రేణులు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి 73వ జయంతిని మంగళవారం తాళ్లరేవు మండలంలో నిర్వహించారు. తాళ్లరేవు అంబేడ్కర్ భవనం వద్ద తెదేపా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, గంజా సూరిబాబు, సుంకరపాలెంలో మోపూరి వెంకటేశ్వరరావు, నీలపల్లిలో చిట్టూరి కలికిమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు దంగేటి సూరిబాబు, గంటా గోపి, నేరేళ్లలంకలో ఉప సర్పంచి వస్కా రెడ్డి తదితరులు బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

తాళ్లరేవు, న్యూస్‌టుడే: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ తాళ్లరేవు ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం వద్ద మద్యం దుకాణాల కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతపత్రాన్ని సీఐ కోటేశ్వరరావుకు అందించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మద్యం దుకాణాలు మూత వేసినట్లు ఐ.శ్రీను, యు.వి.రాజు, ఎస్.రామప్రసాద్, ఎం. గణేష్, యు.నరేంద్ర, సీహెచ్. సంతోష్‌కుమార్ తెలిపారు.

తొలగించిన కార్మికులను తక్షణమే తీసుకోవాలి

పెద్దాపురం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన ఒప్పంద కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దాపురం మండలం పులిమేరు గ్రామంలో నిరసన చేపట్టారు. ఉన్నట్టుండి రాత్రికి రాత్రి 4,290 మంది ఒప్పంద కార్మికులను తొలగించడం ఎంత వరకు న్యాయమన్నారు. సంఘం నాయకులు బి. రమేష్, కె. ముసలిబాబు, పి. అన్నవరం, నారాయణరావు, భూషణం, తమ్మిబాబు పాల్గొన్నారు.

విశేష పూజలు.. ఆలయాల్లో ఉత్సవాలు



దుర్గాడ ఆలయంలో ఉమారామలింగేశ్వరుడు



అలంకరణలో పైడితల్లి

పిఠాపురం: పిఠాపురం వేణుగోపాలస్వామి ఆలయంలో లోక కల్యాణార్థం విశేష శాంతి హోమం మంగళవారం నిర్వహించారు. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఉభయగోదావరి జిల్లాల జనసేన కోఆర్డినేటర్ చల్లా లక్ష్మి ఆధ్వర్యంలో హోమం జరిపించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: దుర్గాడ శివాలయంలో మాసశివరాత్రి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పారాయణం, 11 రుద్రాలు, 21 రకాల ద్రవ్యాలతో అభిషేకించారు. అర్చకులు వీరబాబు, దత్తు సోదరులు వేదమంత్రోచ్చారణ చేశారు.

పిఠాపురం: పిఠాపురంలోని పలు ప్రాంతాల్లో పైడితల్లి అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచి మంగాయమ్మరావుపేట, రామా థియేటర్ సెంటర్, ఇందిరానగర్‌లలోని ఆలయాల వద్ద శోభ సంతరించుకుంది. సాంస్కృతిక ప్రదర్శనలు, గరగ నృత్యాలు ఆకట్టుకున్నాయి.





అమ్మవార్లుగా వస్త్ర ధారణలో విద్యార్థినులు

ముందస్తు దసరా సంబరాలు



గొల్లప్రోలులో రాక్షస సంహార ఘట్టం

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని మాధురీ విద్యాలయలో ముందస్తుగా దసరా సంబరాలు సందడిగా మంగళవారం నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు, నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మ కోలాట ప్రదర్శన చేశారు. తమ్మయ్యనాయుడు, సీతాదేవి, మమత తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం: దసరా పండగ పురస్కరించుకుని పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థినులు మంగళవారం దసరా వేషాలు ధరించారు. సంప్రదాయ స్వాగతం, సాంస్కృతిక ప్రదర్శనలతో వేడుకలు నిర్వహించారు.

పిఠాపురం: విద్యార్థులు దసరా పండగ ప్రాముఖ్యత తెలుసుకోవాలని ప్రిన్సిపల్ వేణు తెలిపారు. భాష్యం పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. చిన్నారులు వేషధారణల్లో ఆకట్టుకున్నారు. నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అరుణ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: విజయదశమిని పురస్కరించుకుని సామర్లకోట భాష్యం పాఠశాలలో దసరా వేడుకల్లో పలువురు విద్యార్థులు అమ్మవార్ల వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

నిర్మించిన రోడ్డుకు తీర్మానమా..?!

సర్పవరం జంక్షన్: గత ప్రభుత్వంలో ఎనిమిది నెలల కిందట తిమ్మాపురం అవంతినగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన రహదారికి ఇప్పుడు గ్రామ పంచాయతీలో తీర్మానం చేయమంటున్నారని, అలాచేస్తే తనపై లేనిపోని ఆరోపణలొస్తాయని సర్పంచి బెజవాడ సత్యనారాయణ వాపోయారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యేకు కొంతరు తనపై తప్పుడు మాటలు చెబుతున్నారని ఆరోపించారు.

అక్రమంగా నిల్వచేసిన బాణసంచా స్వాధీనం

సర్పవరం జంక్షన్: చీడిగలో వాసంశెట్టి వీరబాబుకు చెందిన రేకులషెడ్డులో అనుమతులు లేకుండా అక్రమంగా రూ. 50 వేల విలువైన బాణసంచా నిల్వచేశారు. దానిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఇంద్రపాలం ఎస్సై వీరబాబు మంగళవారం తెలిపారు.

రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటాలి



క్రీడాకారులతో కోచ్ లక్ష్మణరావు

పిఠాపురం: మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని బాక్సింగ్ కోచ్ లక్ష్మణరావు మంగళవారం సూచించారు. మహిళల విభాగంలో కె.హరిణి, ఓపెన్ వెయిట్ కేటగిరిలో జె. ఐశ్వర్య, పురుషుల విభాగంలో జేఆర్ ఆదిత్య ఎంపికవగా వారిని అభినందించారు. ✦ పిఠాపురం ఓబీఎస్ మున్సిపల్ పాఠశాలకు చెందిన వి. రాజు(తైక్వాండో), కరుణాకర్, అహరోన్(రగ్బీ) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ సుధారాణి తెలిపారు. వీరిని హెచ్‌ఎం రమేష్ అభినందించారు.

భవన నిర్మాణ కార్మికుల ఆందోళన



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

గొల్లప్రోలు: ఇసుక లభించి, భవన నిర్మాణాలు కొనసాగేలా చేసి తమకు పనులు కల్పించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. గొల్లప్రోలులోని శ్రీరామచంద్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం నుంచి ప్రదర్శనగా తహసీల్దారు కార్యాలయం చేరుకున్నారు. తహసీల్దారు సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. అనిశెట్టి నూకరాజు, ఉమ్మిడి వీర్రాజు, మొగలి వరప్రసాదరావు, తొగరు గంగాఈశ్వరరావు, కె.వీరబాబు, గుండ్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని రాష్ట్రీయ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు కూడా విన్నవించారు. చక్రధర్, తాతీలు, శ్రీను, అశోక్, చక్రం, చంద్రశేఖర్, వీరబాబు పాల్గొన్నారు.

రక్తదానం.. కదలాలి యువతరం



దాతలు పి.నారయ్య, డి.మాణిక్యాలరావు

కరప: ఆపదలో ఉన్నవారికి సమయానికి రక్తం అందించేందుకు దాతలు ముందుకు రావాలని సామాజిక సేవా కార్యకర్త పోలిశెట్టి నారయ్య కోరారు. జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కాకినాడలోని అభయ బ్లడ్ బ్యాంకులో 90వ సారి రక్తదానం చేశారు. దేవు మాణిక్యాలరావు 20వ సారి రక్తదానం చేశారు.

సర్పవరం: రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుతున్నారని, వారి సేవలకు వెలకట్టలేమని న్యాయవాది రవి శంకర్ పట్నాయక్ తెలిపారు. కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలో స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవంలో అడబాల ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాతలు కృష్ణమోహన్, చింతా పవన్‌కల్యాణ్, దేవ మాణిక్యాలరావు, సాన వీరమణికంఠను సన్మానించారు. ట్రస్టు ఛైర్మన్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పిచ్చి మొక్కలు తొలగించండి

సమస్య: పెద్దాపురం పట్టణం సర్వారాయ కాలనీ ప్రాంతంలో పిచ్చి మొక్కలు రోడ్డు మీదకు వచ్చాయి. వాటిని తొలగించడానికి పురపాలక సంఘ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సూర్యనారాయణ, స్థానికుడు


సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపించి పిచ్చి మొక్కలను తొలగిస్తాం.

– కేవీ పద్మావతి, కమిషనర్

– న్యూస్‌టుడే, పెద్దాపురం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198
పిఠాపురం: 80085 65544

కొళాయిల్లో నురగనీరు..



సామర్లకోట పట్టణ ప్రజలకు పురపాలక సంఘం ద్వారా సరఫరా చేస్తున్న రక్షిత మంచినీరు నురగలతో వస్తుందని జిల్లా మానవహక్కుల పరిరక్షణ సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ అన్నారు. స్థానిక ఉండూరు రోడ్డులో చెరువ వద్ద ఫిల్టర్ ప్లాంటు ద్వారా గోదావరి జలాలను శుద్ధిచేసి సరఫరా చేస్తున్నారన్నారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీరు నురగలతో రావడంతో ఈ నీటిని తాగాలో లేదో అర్థం కాక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సమస్యను కమిషనర్ శ్రీవిద్య దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, సామర్లకోట

మహాత్ముడి స్ఫూర్తిపథం



గొల్లప్రోలులో ప్రైవేటు భవనంపై గాంధీజీ విగ్రహం



గాంధీనగర్‌లో మహాత్మాగాంధీ విగ్రహం, వేదిక



గొల్లప్రోలులోని గాంధీనగర్ ప్రాంతం

గొల్లప్రోలు: స్వాతంత్ర్య సాధనలో మహాత్మాగాంధీ కృషిని భవిష్యత్తు తరాలకు పరిచయం చేసేలా స్ఫూర్తిగా నిలుస్తోంది గొల్లప్రోలు. ఇక్కడి ఒక ప్రాంతానికి గాంధీనగరమని పేరు పెట్టడంతోపాటు కూడలిలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటుచేసి వేదిక నిర్మించారు. ఆ వేదికను ఇటీవల స్థానిక యువకులు ఆధునికీకరించి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. 1999లో నిర్మించిన నగర పంచాయతీ దుకాణ సముదాయానికి బాపూజీ షాపింగ్ కాంప్లెక్స్‌గా నామకరణం చేశారు. ఇక్కడి ప్రైవేటు భవనాలపైనా గాంధీజీ విగ్రహాలు ఉండడం విశేషం. చాలామందికి గాంధీ పేర్లు ఉంటాయిక్కడ. వాసవీక్లబ్ కపుల్స్ తదితర సంస్థలు ఏటా మహాత్ముడి స్ఫూర్తిని కొనసాగించేలా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం విశేషం.

ఓం నమో నారాయణాయ మంత్ర పఠనం



వేంకటేశ్వరస్వామి పూజల్లో ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు దంపతులు

సర్పవరం జంక్షన్: కాకినాడ అర్బన్ గోడారిగుంటలోని కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు నివాసంలో మంగళవారం ఉదయం వేదపండితులు ఓం నమోనారాయణాయ మంత్ర పఠనం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


తగ్గిన సుద్దగెడ్డ వరద

గొల్లప్రోలు: గొల్లప్రోలు నుంచి జగనన్నకాలనీకి వెళ్లే మార్గంలో అయిదు రోజులపాటు ప్రవహించిన సుద్దగెడ్డ వరద మంగళవారం సాయంత్రానికి తగ్గింది. కాలనీకి వెళ్లే మార్గంలో కాజ్‌వే పైనుంచి సుద్దగడ్డ వరద స్వల్పంగా ప్రవహిస్తుండడంతో నీటిలోంచి రాకపోకలు సాగిస్తున్నారు. బుధవారం సాయంత్రానికి వరద పూర్తిగా తగ్గే అవకాశం ఉన్నట్లు కాలనీవాసులు తెలిపారు. రెండు రోజులుగా వర్షాలు కురవకపోవడంతో వరద ఉద్ధృతి తగ్గింది. గొల్లప్రోలు శివారు ఏలేరు కాలువలోనూ నీటి ఉద్ధృతి తగ్గింది.

ఉచిత ఇసుక హామీని తక్షణం అమలుచేయాలి

పెద్దాపురం: ఉచిత ఇసుక హామీని తక్షణం అమలుచేయాలని సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు స్మారక భవనం ఆవరణలో సీపీఎం పార్టీ జెండాను ఆవిష్కరించారు. శ్రీనివాస్, సత్తిబాబు, క్రాంతికుమార్, మునేశ్వరరావు, తాతారావు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి నిరంతర కృషి



రత్నప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వనమాడి

సర్పవరం జంక్షన్: వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రత్యేక శాఖ ద్వారా నిరంతరం కృషి చేస్తున్నాయని, వారి అవసరాలు గుర్తించి పలు పథకాలు అందిస్తున్నామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు తెలిపారు. రమణయ్యపేటలో వయోవృద్ధులు, దివ్యాంగులు సంక్షేమశాఖ ఏడీ నారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వృద్ధుల దినోత్సవంలో ముఖ్యఅతిథిగా వనమాడి పాల్గొన్నారు. రత్నప్రసాదరావు, సత్యనారాయణ, వెంకటరమణమూర్తిలను సత్కరించారు. బుద్ధరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పండ్లు పంపిణీ



కేకు కోస్తున్న కూటమి నాయకులు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం స్థానిక మాజీ పురపాలక సంఘ ఛైర్మన్ రాజాసూరిబాబురాజు కేకు కట్ చేశారు. అనంతరం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, పట్టణ తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు రంధి సత్యనారాయణ, తూతిక రాజు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో వృద్ధులకు దుస్తులు..

కాజులూరు: వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గొల్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నారాలోకేశ్ యువజన ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు చుండ్రు వీర్రాజు చౌదరి మంగళవారం 100 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. డాక్టర్ సౌజన్య, వైకుంఠరావు, తాతబ్బాయి, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితులపై దాడులు సహించం

పిఠాపురం: రాష్ట్రంలో దళితులపై పెరిగిన దాడులను సహించేది లేదని, ప్రభుత్వం స్పందించాలని బీఎస్పీ నాయకులు లోవరాజు పేర్కొన్నారు. కత్తులగూడెంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్లో దళితులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కాకినాడ గ్రామీణ, ఉండి ఎమ్మెల్యేలు నానాజీ, రఘురామ ఉదంతాలను ప్రస్తావించారు. అప్పారావు, అబ్బు, యేసు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

3న మండల పరిషత్ సమావేశం

పిఠాపురం: పిఠాపురం మండల సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీడీవో చిన్నారావు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని కోరారు.

వరిలో ఎండుతెగులు నివారణకు సూచనలు

పెదపూడి: వరిపొలంలో వచ్చే ఎండుతెగులు నివారణకు సుడోమోనాస్ మందు పనిచేస్తుందని కాకినాడ ఏడీఏ ప్రశాంతి అన్నారు. మంగళవారం పెదపూడి మండలం సంపర గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా వరిపొలాలను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు.

4న విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెదపూడి: కరకుదురు ఉపవిద్యుత్తు కేంద్రంలో ఈ నెల 4న మరమ్మతుల నిమిత్తం గ్రామంలో విద్యుత్తు సరఫరాకు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు అంతరాయం ఏర్పడునని విద్యుత్తు శాఖ ఏఈ జి.వి.వి. సత్యనారాయణ మంగళవారం తెలిపారు.

విజ్ఞానశాస్త్రంపై అవగాహన పెంచుకోవాలి



బహుమతి ప్రదానం చేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు



కాజులూరులో గెలుపొందిన వారిని అభినందిస్తున్న ఎంఈవో డేవిడ్

కాజులూరు, న్యూస్‌టుడే: విజ్ఞానశాస్త్రంపై విద్యార్థులు అవగహన పెంచుకుంటూ మూఢ నమ్మకాలను వదలిపెట్టాలని ఎంఈవో డేవిడ్ అన్నారు. మంగళవారం కాజులూరులో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. కాజులూరు జిల్లా పరిషత్తు హైస్కూల్ విద్యార్థులు వాసిరెడ్డి రామలక్ష్మి సాయి వంశీ, లహరి సీనియర్ విభాగంలో ప్రథమస్థానం సాధించారు. కుయ్యేరు జిల్లా పరిషత్తు హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలోనూ, అయితపూడి జిల్లా పరిషత్తు హైస్కూల్ విద్యార్థులు తృతీయస్థానంలో విజయం సాధించారు. జూనియర్ విభాగంలో మంజేరు మండల పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానంలోనూ, తిప్పరాజుపాలెం మండల పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో విజయం సాధించి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పంపన కృష్ణమూర్తి, శీరం దుర్గా ప్రసాద్, రాయుడు సుధీర్, జె.శ్యామ్యూల్ బెన్‌హర్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి ప్రతిభా పరీక్ష విజేతలు

పెద్దాపురం: పెద్దాపురం పట్టణం మహారాణి కళాశాల మంగళవారం నిర్వహించిన మండలస్థాయి చెకుముకి సీనియర్ కేటగిరి టాలెంట్ టెస్టులో దివిలి గ్రామంలోని లిఖిత పాఠశాలకు చెందిన విద్యార్థులు వి. శివలాస్య, డి. వర్ధిని, ఎ. బాలమణికంఠ విజేతలుగా గెలుపొందారు. వీరికి రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పయిడిపల్లి సూర్యనారాయణమూర్తి, మల్లోజు కరుణాకర్ బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయంతోనే రైతుకు మేలు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: తక్కువ పెట్టుబడితో సులుభంగా పంటలను పండించే విధంగా నూతన పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని కరప సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ బాబూరావు అన్నారు. చొల్లంగి, చొల్లంగిపేటల్లో మండల వ్యవసాయాధికారిణి ప్రశాంతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

తుని
• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయించాలని వినతి


యనమలకు వినతిపత్రం అందిస్తున్న సంఘం నాయకులు


తుని గ్రామీణం: మద్యం షాపులను కల్లుగీత కార్మిక సంఘానికి కేటాయించాలని కోరుతూ తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుకు మంగళవారం సభ్యులు వినతిపత్రం అందించారు. మండలంలోని తేటగుంట పార్టీ కార్యాలయంలో తుని కల్లుగీత కార్మిక సంఘం నాయకులు ఆయన్ని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం గీత కార్మికులకు 10 శాతం దుకాణాలు కేటాయించేలా చర్యలు చేపడతామన్నారు.

మొక్కలు నాటిన టోల్ ప్లాజా సిబ్బంది



కిర్లంపూడి, న్యూస్‌టుడే: కిర్లంపూడి మండలం కృష్ణవరంలోని జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు టోల్ ప్లాజా అధికారులు, సిబ్బంది స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాంగణాన్ని పరిశుభ్రం చేసి రోడ్డు వెంబడి మొక్కలు నాటారు.

సమష్టి బాధ్యతే 'స్వచ్ఛ'ందం!



న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

పల్లె ప్రగతికి శుభ్రత గీటురాయి. కొండల్లో, మారుమూల ప్రాంతాల్లో ఉండే మన్యం పల్లెలు నిరంతరం స్వచ్ఛదనం పాటిస్తున్నాయి. మైదాన ప్రాంతాల్లోని గ్రామాల్లో.. అంతస్తుల భవనాలు, మెరిసిపోయే సిమెంటు దారులున్నా స్వచ్ఛత సవాలుగానే ఉంటుంది. వీధుల్లోనే వాడకం నీరు, ఊరి చివర, చెరువుల్లో చెత్త కనిపిస్తుంటుంది. మన్యం పల్లెల్లో.. ఒకదానిని ఒకటి ఆనుకుని ఉండే పూరిళ్లు, పక్కా ఇళ్లు, మధ్యలో సన్నని దారులు, ఎక్కడికక్కడ కొళాయిలు ఉన్నా.. పారిశుద్ధ్య కార్మికులు లేకున్నా ఇంట్లో మాదిరి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటున్నారు. ఏ కాలంలో వెళ్లినా గూడేల్లోని వీధులు ముచ్చటగానే ఉంటాయి. కొండపై ఉన్న సబ్‌ప్లాన్ పల్లెల్లో స్వచ్ఛతా హీ సేవను ఎప్పటినుంచో ఆచరిస్తున్నారు. మైదాన, పట్టణ ప్రాంతాలతో పోలిస్తే.. అక్కడ వీధి, పరిసరాల శుభ్రతకు పంచాయతీలపై ఆధారపడడం లేదు. నియోజకవర్గంలో 67 పంచాయతీల్లో 128 గ్రామాలుండగా వీటిలో 32 గ్రామాలు ఉప ప్రణాళిక మన్యం పరిధిలోకి వస్తాయి. ఎత్తైన కొండల్లో బురదకోట, పెదమల్లాపురం, వంతాడ, మెట్టుచింతతో సహా 15 గూడేలు ఉన్నాయి. 50 వేల జనాభా నివసిస్తోంది. మైదాన ప్రాంతంలో 2.8 లక్షల మంది ఉంటున్నారు. ఏ సౌకర్యమైనా గిరిజన పల్లెలకు చేరడానికి ఆలస్యమే అవుతుంది. అయినా పల్లెదనంతో పాటు స్వచ్ఛదనం కళ్లకు కడుతుంది. జీఎల్ఆర్‌ల వద్ద నీరు నిల్వ ఉండదు.. దగ్గరగా ఇళ్లు.. అయినా వాడకం నీటిని జనం తిరిగే మార్గంలో పారేలా చేయరు. పెరట్లోనే నీటిని ఇంకింపచేయడం వల్ల ఇళ్ల మధ్య మురుగు పారదు. సిమెంటు రోడ్లను శుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా కనిపిస్తుంది. వర్షం నీరు తప్ప వాడకం నీటితో ఇరుగు పొరుగుకు ఇబ్బంది ఉండదు. వీధి చివరో, ఇంటి ముందో చెత్తకుప్పలు పెట్టరు. ఒక ఇంటి చూరు మరో ఇంటికి తగులుతున్నట్టు ఉన్నా.. వ్యర్థాలు, మురుగు నీరు జనావాసాల మధ్య ఉంచుకోరు.


మెట్టుచింతలో శుభ్రంగా వీధి


బాపన్నధారలో కొళాయిల వద్ద..

డ్వాక్రా రుణాలతో స్వయం ఉపాధి

ఆర్థికంగా రాణిస్తున్న మహిళలు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. ఆయా రుణాలతో పలు రకాల వ్యాపారాలు చేస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా వివిధ వస్తువులను తయారీ, ప్యాకింగ్‌తో మార్కెటింగ్ మహిళలు రాణిస్తున్నారు. ఇంట్లోనే కుటీర పరిశ్రమలు నిర్వహిస్తూ కుటుంబ పోషణలో కీలకంగా మారుతున్నారు. వస్తుత్పత్తులను విక్రయిస్తూ.. ఉత్పత్తి చేస్తూ బ్యాంకు రుణాలు సక్రమంగా చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కాత్రావులపల్లిలోని గణేశ్వరి గ్రూపు సభ్యులు దాదాపు ఎనిమిదేళ్లుగా వ్యాపారంలో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

మండలం	సంఘాలు	సభ్యులు	బ్యాంకు రుణాలు (రూ.కోట్లలో)
జగ్గంపేట	2204	22150	52
కిర్లంపూడి	2085	21300	66
గండేపల్లి	1463	14630	56
గోకవరం	1896	19215	85

పాలకోవా, కొబ్బరుండల తయారీ..

గ్రామానికి చెందిన మొండి రామలక్ష్మి గణేశ్వరి డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. రూ.3 లక్షతో పాలకోవా, కొబ్బరి ఉండల తయారుచేసే వ్యాపారాన్ని ప్రారంభించాను. వీటిని డబ్బాల్లో నింపి స్థానికంగా, చుట్టుపక్కల షాపులకు విక్రయిస్తూ రోజూవారీ ఆదాయం ఆర్జిస్తున్నా. ఇప్పటికి పలుమార్లు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లిస్తున్నా.

- కోటంశెట్టి రామలక్ష్మి, గణేశ్వరి గ్రూపు, కాత్రావులపల్లి


పాలకోవా తయారీలో రామలక్ష్మి

కలిసికట్టుగా శ్రమించారు..

ఏలేశ్వరం: బ్యాంకులు అందిస్తున్న ఆర్థిక సాయాన్ని మహిళాశక్తి సంఘాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించేందుకు కృషి చేస్తున్నాయి. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పట్టణ సమన్వయకర్త సాయికుమార్ నిత్యం మహిళలకు సూచనలు, సలహాలు ఇస్తూ అండగా ఉంటున్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా మహిళలు ముందడుగు వేస్తున్నారు. ఏలేశ్వరం పట్టణంలో సూర్య మహిళా శక్తి సంఘం 2012లో ఏర్పాటైంది. అధ్యక్షురాలుగా తేలు లక్ష్మి వ్యవహరిస్తున్నారు. ఈమె ఆధ్వర్యంలో మరో 9 మంది కలిసికట్టుగా సంఘాన్ని నిర్వహిస్తూ మన్ననలు పొందుతున్నారు. సంఘానికి ప్రారంభంలో రూ. పది వేల వంతున బ్యాంకులు రుణం ఇచ్చాయి. మహిళలు రుణాలను సక్రమంగా చెల్లించడంతో సంఘానికి రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు బ్యాంకులు రుణం అందజేశాయి. మహిళలంతా కలసి బేకరీ తినుబండారాలను తయారుచేసి మార్కెట్‌కి పంపుతున్నారు. రుణాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నారు.


ఏలేశ్వరంలో బేకరీ తినుబండారాలను సిద్ధం చేస్తున్న మహిళలు

సమర్థంగా పింఛను పథకం అమలు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛను పథకాన్ని కూటమి ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఇర్రిపాక సచివాలయంలో మంగళవారం ఉదయం ఆయన పలువురు లబ్ధిదారులకు పింఛను నగదు అందించి మాట్లాడారు. ఇంటి వద్దకే పింఛను పథకాన్ని పక్కాగా అమలు చేస్తూ లబ్ధిదారులందరికీ నెల మొదటి రోజే నూరు శాతం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కూటమి నాయకులు జ్యోతుల నాగబాబు, బస్వా చినబాబు, పంతం సత్యనారాయణ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఇర్రిపాకలో పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

తొండంగి: ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను తెదేపా సీనియర్ నాయకులు యనమల రాజేష్, కొయ్యా రామకేశవ, వొక్కా అప్పారావు, వొక్కా కాశి, కాలిబోయిన చంద్రరావు తదితరులు మంగళవారం పంపిణీ చేశారు. దానవాయిపేట, నర్సిపేట గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందించారు.

జీతంకన్నా ముందే లబ్ధి

శంఖవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగి జీతంకన్నా ముందే పేదలకు పింఛను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. కత్తిపూడిలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తెల్లవారకుండానే సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పింఛను పంపిణీ చేస్తున్నారన్నారు. మొదటి రోజే 99 శాతం నగదు అందజేసినట్లు తెలిపారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు, మండలాధ్యక్షుడు బద్ది రామారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల తమ్మయ్యబాబు పాల్గొన్నారు.


కత్తిపూడిలో నగదు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

కృష్ణాలయంలో పూజలు

కత్తిపూడి యాదవ వీధిలోని కృష్ణాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణం కాపాడాలి

తుని, న్యూస్‌టుడే: ఆరోగ్యంగా ఉండేవారంతా రక్తదానం చేయాలని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.స్వప్న కోరారు. ప్రపంచ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో మళ్లీ దానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. దాతలను ప్రశంసిస్తూ డాక్టర్ స్వప్న ధ్రువీకరణ పత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో [illegible] వైద్యాధికారి హరి చందన్, అభివృద్ధి కమిటీ సభ్యుడు జె.విజయ్, సిబ్బంది వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



తునిలో రక్తదానం చేస్తున్న యువకులు

గ్రామ సమస్యలపై సచివాలయాల వద్ద ధర్నా

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: చింతలూరు, వెంకటనగరం, పోతులూరు, లంపకలోవ గ్రామాల్లో అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం (ఆయార్లా) ఆధ్వర్యంలో ప్రదర్శన, సచివాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. గ్రామంలో సమస్యలను ఏకరువు పెడుతూ నినాదాలు చేశారు. ఆయా గ్రామాల ప్రధాన సచివాలయాలకు చేరుకుని వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఈనాం భూములు సాగుచేస్తున్న వారికి హక్కులు కల్పించాలని, గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, డ్రైనేజీ నిర్మాణం, వీధి దీపాలు ఏర్పాటు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సి.పి.ఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లక్ష్మణ, ఆయార్లా ప్రతినిధులు తాడి నాగేశ్వరరావు, బండి తల్లి, దుమ్ముల సింహాచలం, రాజమణి, కామరాజు తదితరులు ఈ ఆందోళనకు నాయకత్వం వహించారు.



చింతలూరు సచివాలయం వద్ద ఆందోళన

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

చేతిపంపు బాగు చేశారు

శంఖవరం: మండపం గ్రామంలో ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉన్న చేతిపంపు పనిచేయక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించారు. సిబ్బందిని పంపి చేతిపంపు బాగు చేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066


కాగడాల ప్రదర్శనలో తుమ్మపల్లి రమేష్, జనసేన కార్యకర్తలు

పవన్ కల్యాణ్ దీక్షకు మద్దతుగా కాగడాల ప్రదర్శన

కిర్లంపూడి, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో పశు కొవ్వుతో కూడిన నెయ్యి వినియోగించి అపచారానికి పాల్పడంపై ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా కిర్లంపూడిలో జనసేన నాయకులు, కార్యకర్తలు మంగళవారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో వందల సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు కిర్లంపూడిలోని ఏనుగువీధి నాలుగురోడ్ల ప్రధాన కూడలి నుంచి జగపతినగరం గ్రామ శివారు వరకు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్ష నిర్వహించి సాయంత్రం విరమించారు. కార్యక్రమంలో యల్లపు దొరబాబు, గంధం ప్రభాకర్, మేడిబోయిన శ్రీను, బాలు, వీరబాబు, రామకృష్ణ, గంగాధర్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదమరిస్తే గుంతలో పడతారు..

జగ్గంపేట గ్రామీణ మండలం బావవరం నూకాలమ్మ ఆలయ సమీపంలోని ఆర్.భ. రోడ్డు కోతకు గురైంది. రోడ్డుపక్కనున్న పంటకాలువలోని నీరు వేగంగా ప్రవహించడంతో రోడ్డు కింద భాగం కుంగిపోయి డొల్లగా మారింది. రోడ్డుపక్కనున్న గుంతలోకి వాహనదారులను హెచ్చరిస్తున్నారు. ఇక్కడ రాత్రిపూట దీపాలు, రక్షణ లేకపోవడంతో వాహనదారులు గుంతలోపడే ప్రమాదం పొంచి ఉంది.



- న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

శరన్నవరాత్రి ఉత్సవాలకు విగ్రహాలు సిద్ధం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామాల్లో ఆలయాలు, యువజన సంఘాలు మండపాలు సిద్ధం చేస్తున్నాయి. వినాయక చవితి వేడుకలు ముగిసిన నాటి నుంచే కళాకారులు అమ్మవారి విగ్రహాలను మెరుగులు దిద్దడంలో నిమగ్నమయ్యారు. వివిధ ఆకృతుల్లో దుర్గమ్మ విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. రెండు అడుగుల నుంచి మొదలుకొని 15 అడుగల ఎత్తులో ప్రతిమలను కళాకారులు తీర్చిదిద్దుతున్నారు. ఒక్కో విగ్రహం రూ.3 వేల నుంచి 20 వేల వరకు ధర పలుకుతున్నాయి. మండలంలోని గొల్లలగుంట గ్రామానికి చెందిన అంకాబత్తుల లీలా కుమార్ కుటుంబ సభ్యులు పూర్వీకుల నుంచి మట్టిపాత్రలు తయారుచేస్తూ జీవనం పొందే వారు. కాలక్రమేణా వినాయక, దుర్గాదేవి విగ్రహాలు తయారుచేస్తూ పదేళ్లుగా ఉపాధి పొందుతున్నారు.


విగ్రహానికి రంగులద్దుతున్న దుర్గ

చేయివడితే రూపం మారాల్సిందే..

విగ్రహాలకు ఆకర్షణీయ రూపం తీసుకురావడంలో అంకాబత్తుల దుర్గ నైపుణ్యం సాధించారు. వినాయక చవితి, శరన్నవరాత్రి ఉత్సవాలకు విగ్రహాలను తయారు చేయడం ఒక ఎత్తయితే వాటికి ఆకర్షణ తీసుకువచ్చేలా తుదిమెరుగులు దిద్దడం మరో ఎత్తు. లీలాకుమార్ కుటుంబ సభ్యులతో పాటు మరో నాలుగు కుటుంబాల వారు విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. విగ్రహాల కళ్లు, కనురెప్పలు, చక్కిళ్లు, బొట్టు తదితర అంశాలకు రంగులు వేస్తూ ఆకర్షణీయమైన రూపం తీసుకొస్తున్నారు.

చెకుముకి సైన్సు సంబరాలు

ప్రత్తిపాడు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్సు సంబరాలు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. సీనియర్ల విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ధర్మవరం హైస్కూలు, ఒమ్మంగి జడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థులు నిలిచారు. జూనియర్ల విభాగంలో ధర్మవరం, లంపకలోవ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ప్రైవేటు పాఠశాలల్లో సీనియర్ విభాగంలో ప్రత్తిపాడు అఖిల్ స్కూలు, ధర్మవరం శ్రీప్రతిభ విద్యాలయ విద్యార్థులు, జూనియర్లలో ఒమ్మంగి శ్రీభారతి విద్యాలయ, ధర్మవరం శ్రీప్రతిభ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఎంఈవో రాజబాబు, హెచ్‌ఎం సత్యనారాయణ రెడ్డి, కన్వీనరు వెంకటరమణ, యూటీఎఫ్ నేతలు శ్రీనివాసరావు, డి.రాజబాబు, రామలింగేశ్వరరావు, ప్రసాద్‌బాబు, రమణ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.


బహుమతులు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రౌతులపూడి: జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి సైన్సు పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కోళ్ల రాంబాబు, వి.అచ్చిరాజు, బేతా వెంకటరమణ, బాలాజీ, పి.అచ్చిరాజు, వరప్రసాద్ తదితర ఉపాధ్యాయులు పరీక్ష నిర్వహించారు.

అవీ ఇవీ అన్నీ

ఆకు ఎండే తెగులు

గండేపల్లి: వరిలో ఆకు ఎండే తెగులుకు సూడోమోనస్ పిచికారీ చేయాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ హరి తెలిపారు. జడ్.రాగంపేట గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం బీపీటీ-5204 రకాల్లో ఆకు ఎండు తెగులు ఎక్కువగా ఉందని, నివారణకు ఎకరానికి సుడోమోనాస్ కేజీ, 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

ఉపాధి హామీ పనుల గుర్తింపు

గండేపల్లి: ఉపాధి హామీ పథకంలో కొత్త పనులు గుర్తించి అంచనాలు తయారు చేయనున్నామని ఏపీవో గంగా భవాని అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో చేయాల్సిన పనులను గుర్తించడానికి 18 పంచాయతీల్లో ఈనెల 7 నుంచి 26 వరకు గ్రామసభలు నిర్వహిస్తామని చెప్పారు.

7 నుంచి గ్రామసభలు

జగ్గంపేట: జగ్గంపేటలోని 16 పంచాయతీల్లో ఈనెల 3 నుంచి 30 వరకు ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తామని ఎపీవో రామకృష్ణరాజు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్త పనులు గుర్తించి, అంచానాలు వేసేందుకు సభలు నిర్వహిస్తామన్నారు.

డొక్కా సీతమ్మ పేరిట భోజనాలు

జగ్గంపేట: ప్రతీ పేదవాడి ఆకలి తీర్చడమే జనసేన ధ్యేయమని ఆ పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. మంగళవారం పాత పోలీస్‌స్టేషన్ ఎదురుగా డొక్కా సీతమ్మ పేరిట భోజనాలు వడ్డించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ మంగళవారం పేలకు భోజనాలు పెడుతున్నామని, మేడిబోయిన శ్రీను ఆర్థికసాయంతో అన్నదానం చేసినట్లు తెలిపారు.

7న ఉపకరణాల పంపిణీ

జగ్గంపేట: అర్హులైన దివ్యాంగులకు ఈనెల 7న ఉపకరణాలను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా అందిస్తామని జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు అప్పన్నదొర అన్నారు. అలిమ్కో సంస్థ సహకారంతో ఆగస్టు 3న శిబిరం నిర్వహించి అర్హులను ఎంపికచేశామని చెప్పారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఏలేశ్వరం డిపోనకు చెందిన బస్సు కాకినాడ నుంచి ప్రయాణికులతో బయల్దేరింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో జగ్గంపేట చేరుకునే సమయంలో సాంకేతిక లోపంతో మొరాయించడంతో ప్రయాణికులు ఎండలో అవస్థలు ఎదుర్కొన్నారు. మార్గంమధ్యలో బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు మరో బస్సు కోసం ఎండలో వేచి ఉండాల్సి వచ్చింది. ఆర్టీసీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. డ్రైవర్ లక్ష్మణరావు సమాచారాన్ని డిపోనకు తెలియజేయగా మరో బస్సు సమకూర్చడంతో ప్రయాణికులు ఆ బస్సులో గమ్యానికి చేరారు.



అవస్థలు పడుతున్న మహిళలు

యువతి అదృశ్యంపై కేసు

గండేపల్లి, న్యూస్‌టుడే: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి గ్రామానికి చెందిన యువతి (19) గండేపల్లి మండలం సూరంపాలెం హాస్టల్లో ఉంటూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గత నెల 29న సాయంత్రం ఇంటికి వెళ్తున్నానని వార్డెన్‌కు చెప్పి వెళ్లిన ఆమె అప్పటి నుంచి కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కళాశాలలో ఆహ్వాన వేడుక

రౌతులపూడి: రౌతులపూడిలోని శ్రీ సూర్య డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆహ్వాన వేడుకలో మొదటి సంవత్సర విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



వృద్ధుల హక్కులు పరిరక్షించాలి

ప్రత్తిపాడు: వృద్ధులను అనుభవజ్ఞులైన మార్గదర్శకులుగా చూడాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ న్యాయవాదులు బుగత శివనారాయణ, బొంగుళూరి మధుబాబు అన్నారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడు పాదాలమ్మగుడి సమీపంలోని శారదా వయోవృద్ధ నిలయంలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. వృద్ధుల సంరక్షణ, హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన కలిగించారు. ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కోర్టు సిబ్బంది శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు రాయితీలు

శంఖవరం, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందించే రాయితీలను రైతులు వినియోగించుకోవాలని ఆశాఖ మండలాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. పెదమల్లాపురం, వేళంగి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రైతులకు మంగళవారం ఆయన పలు సూచనలు చేశారు. వంద శాతం రాయితీపై ఆయిల్ పామ్ మొక్కలు అందజేస్తున్నామని, డ్రిప్, స్ప్రింక్లర్లు వంటివి అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

ముందస్తు దసరా ఉత్సవాలు

శంఖవరం, న్యూస్‌టుడే: పాఠశాలలకు బుధవారం నుంచి సెలవులు కావడంతో మంగళవారం కత్తిపూడిలోని మాధురి విద్యాలయలో ముందస్తు దసరా ఉత్సవాలు నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో నృత్యాలు చేశారు. ఆవరణలో నిర్వహించిన రావణాసుర దహన కార్యక్రమం ఆకట్టుకుంది.

కిర్లంపూడి: ఏదయా మీదయా మామీద లేదు.. అంటూ విద్యార్థులు దసరా పాటలు పాడుతూ సందడి చేశారు. తామరాడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మంగళవారం దసరా సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు ప్రత్యేకంగా తయారుచేసిన విల్లంబులతో ఆడిపాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఊర్లువెళ్తే సమాచారం ఇవ్వండి

తుని పట్టణం, న్యూస్‌టుడే: దసరా సెలవులకు ఊర్లకు వెళ్లేవారు తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ చెన్నకేశవరావు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని గొల్లప్పారావు సెంటర్‌లో మంగళవారం రాత్రి స్థానికులతో ఆయన మాట్లాడారు. ముందుగా సమాచారం ఇస్తే ఇళ్లలో చోరీలు జరగకుండా ప్రత్యేకంగా నిఘా పెడతామన్నారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే ఫిర్యాదు చేయాలన్నారు.

జగ్గంపేట: ఊరువెళ్తే మీ విలువైన వస్తువులు జాగ్రత్తని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అన్నారు. ప్రస్తుతం దసరా సెలవుల్లో ఊర్లు వెళ్లేవారు అధికంగా ఉండడంతో చోరీలు ఎక్కువగా జరుగుతాయని అప్రమత్తతపై మంగళవారం ఆటో ప్రచారం నిర్వహించారు. ఎస్సై రఘునాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.


తునిలో మాట్లాడుతున్న సీఐ చెన్నకేశవరావు